
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

ఏలూరు
జిల్లా వార్తలు
3
బుధవారం 3 డిసెంబరు 2025

ఫైలేరియా సర్వే ప్రారంభం



ఏలూరు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్ర జ్యోతి): బోద వ్యాధి జాడలను కనుగొనే లక్ష్యంతో జిల్లాలోని అన్ని మండలాల వారీగా మైక్రో ఫైలేరియా సర్వేను వైద్య ఆరోగ్య శాఖ ప్రారంభించింది. పీహెచ్‌సీల వారీగా జరిగే ఈ నైట్ బ్లడ్ సర్వే (ఎన్‌బీఎస్)ని రాత్రి 8.30 నుంచి 12 గంటల మధ్య ప్రతి మండలంలో ఎంపిక చేసిన రెండు గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు నిర్వహిస్తారు. సర్వేలో భాగంగా ఒక్కో గ్రామం నుంచి 150 చొప్పున రక్త నమూనాలను సేకరించి మండలానికి 300 స్లైడ్‌లను ఈ నెల 5లోగా ల్యాబ్ టెస్టులకు పంపించాలి. వాటిని ల్యాబ్ టెక్నీషియన్లు పరీక్షించి ఎవరికైనా పాజిటివ్ వస్తే వెంటనే వైద్య చికిత్సలు ప్రారంభిస్తారు. జిల్లాలో 1200లకు పైగా ఫైలేరియా వ్యాధిగ్రస్తులుండగా, మూడేళ్లుగా కొత్త కేసులు లేవని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు చెబుతున్నాయి.

హింసకు వ్యతిరేకంగా కృషి చేద్దాం

మహిళలు, బాలికలు, అల్పసంఖ్యాక వర్గాలు ఎదుర్కొంటున్న లింగ ఆధారిత హింస (జండర్ బేస్డ్ వయొలెన్స్)కు వ్యతిరేకంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అమృతం పిలుపునిచ్చారు. మంగళవారం డీఎంహెచ్‌వో మీటింగ్‌హాలులో వైద్యాధికారులకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గృహ హింస, బాల్య వివాహాలు, అమ్మదాడులు, మానసికహింస, వేధింపులు వంటి లింగ ఆధారిత హింసను నిరోధించడానికి చట్టపరమైన రక్షణలు, పోలీసు సహాయం, అవగాహన కార్యక్రమాలను వివరించారు. డీఐవో డాక్టర్ శోభ, డీఎల్‌ఏటీవో డాక్టర్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

4న డీఎల్‌డీవో కార్యాలయం ప్రారంభం

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర వ్యాప్తంగా వున్న డీఎల్‌డీవో కార్యాలయాలతోపాటు స్థానిక బాలుర హైస్కూల్ వద్దవున్న జంగారెడ్డిగూడెం డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీవో) కార్యాలయాన్ని ఈ నెల 4వ తేదీ ఉదయం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ మేరకు డీఎల్‌డీవో ఎం.రాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ర్యాగింగ్ భూతానికి వైద్యమేది ?



ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చాప కింద నీరులా జలు విప్పిన ర్యాగింగ్ భూతానికి వైద్యం చేసేదెవరు ? సీనియర్ల వికృత చేష్టలు భరించలేక జూనియర్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడి.. చివరకు రెండు వర్గాలు ఒకరిపై ఒకరు దాడులకు తెగబడేందుకు కారకులు ఎవరు ? గత నెల 12న ఫ్రెషర్స్ డే సందర్భంగా థర్డ్, సెకండియర్ విద్యార్థుల మధ్య ఘర్షణ తలెత్తి సోమవారం అర్ధరాత్రి దాడులకు తెగబడే వరకు లాగింది ఎవరు ? దీనిపై ర్యాగింగ్ నివారణ కమిటీలు ఏం చేస్తున్నాయి ? పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు ? ఇప్పుడు అందరి నోటా ఇవే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ఏలూరు మెడికల్ కళాశాలలో ఏం జరుగుతోంది ?

- తరచూ ఎంబీబీఎస్ థర్డ్, సెకండియర్ విద్యార్థుల మధ్య ఘర్షణలు
- హాస్టల్ నుంచి 16 మంది సీనియర్ల సస్పెన్షన్
- ప్రిన్సిపాల్ పర్యవేక్షణలో విచారణ కమిటీ
- కష్టపడి చదివి మంచి ర్యాంకులతో సీట్లు సాధించి.. ఎందుకిలా దారి తప్పారు..?
- విద్యార్థులపై కొరవడిన పర్యవేక్షణ

ఏలూరు క్రైం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏలూరు మెడికల్ కళాశాలలో ర్యాగింగ్‌పై వచ్చిన వార్తలతో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ విచారణకు ఆదేశించింది. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి సెకండియర్ విద్యార్థుల నుంచి రాతపూర్వకంగా వివరాలు తీసుకున్నారు. అర్ధరాత్రి హాస్టల్ రూములకు వచ్చి తమకు నిద్ర లేకుండా తెల్లవార్లు వేధిస్తున్నారని ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తెలిపారు. 16 మంది సీనియర్ విద్యార్థులు తమపై ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారని రాత పూర్వకంగా ఇవ్వడంతో వారిని హాస్టల్ నుంచి సస్పెన్షన్ చేశారు. విచారణ పూర్తయ్యే వరకూ వారు హాస్టల్ పరిసరాల్లోకి అడుగు పెట్టకూడదని ఆదేశాలు జారీ చేశారు. డీఎంఈ ఆదేశాలతో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ పర్యవేక్షణలో విచారణ కమిటీ ఏర్పాటుచేయగా ఈ విచారణ కమిటీ బుధవారం నుంచి విచారణ కొనసాగించనున్నారు. సోమవారం రాత్రి పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాల విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎఫ్ఐఆర్ కట్టామంటే బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని, ఇలాంటి వికృత చేష్టలకు ఫుల్ స్టాప్ పెట్టుకోవాలని హెచ్చరించారు.

కళాశాలలో ఏం జరుగుతోంది

ఏలూరులో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుకు ఎంతో మంది అధికారులు, ప్రజా ప్రతినిధుల ఎన్నో ఏళ్లపాటు కృషి చేశారు. చివరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో సీఎం చంద్రబాబు తొలుత వర్చువల్ విధానంలో శంకుస్థాపన నిర్వహించారు. తదుపరి వైసీపీ ప్రభుత్వ హయాంలో రెండు

(మిగతా 6వ పేజీలో)

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు



ర్యాగింగ్ అనేది చెడు సంస్కృతి. ఆత్మనూన్యతాభావం ఉన్నవారే దీనికి పాల్పడతారు. ముందు ఈ లోపాన్ని సరిచే సుకోవాలి. ర్యాగింగ్ చేసే వారు విద్యలో వెనుకబడతారు. కొందరు తమకు గుర్తింపు కావాలని ఇలాంటి చేష్టలకు పాల్పడుతుంటారు. ర్యాగింగ్ నియంత్రణకు ఏపీ ర్యాగింగ్ యాక్టు అమలులో ఉంది. జూనియర్స్ భయపడవద్దు. సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం. తల్లిదండ్రులు తమ పిల్లల ఏం చేస్తున్నారో ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. ఫ్యాకల్టీ ఏ విధమైన చర్యలు తీసుకోవాలో అవగాహన కల్పిస్తాం. ఏలూరు మెడికల్ కళాశాలతోపాటు ఇతర కళాశాలల్లో విద్యా ర్థులకు ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తాం. విద్యా ర్థుల్లో పోటీతత్వం పెంచేందుకు క్రీడలు నిర్వహిస్తాం. నేనే ఏలూరు మెడికల్ కళాశాలను సందర్శించి వారితో మాట్లాడ తాను. వీలైనంత వరకూ మానవతా దృక్పథంతో కౌన్సెలింగ్ ఇస్తాం. ప్రవర్తనలో మార్పు రాకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

\- ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్

21న పోలియో చుక్కల మందు పంపిణీ

ఏలూరు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్ర జ్యోతి):ఐదేళ్లలోపు చిన్నారులకు ఈ నెల 21న పోలియో చుక్కల మందు పంపిణీ చేపట్టనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం తెలిపారు. పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీల వైద్యాధికారులకు మంగళవారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు అవసరమైన పోలియో వ్యాక్సిన్ 8 లక్షల డోసులను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈ జిల్లాల డిమాండ్ మేరకు ఇక్కడి నుంచే సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఏలూరు జిల్లాలో 2.78 లక్షల మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నారు. వీరందరికీ 21న వ్యాక్సిన్ చుక్కల మందు వేయడానికి అవసరమైన వైద్య సిబ్బందిని నియమిస్తున్నట్లు వివరించారు.

ఏటీఎస్‌ల్లోనే వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు

ఏలూరు క్రైం, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి):ఉమ్మడి పశ్చిమలోని వాహనాల ఫిట్‌నెస్‌కు మచిలీపట్టణం, రాజమండ్రి, అమలాపురంల్లోని ఆంధ్రప్రదేశ్ మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అండ్ హైవేస్ (మోర్త్) ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్)లో ఫిట్‌నెస్ చేయించుకోవాలని రవాణా శాఖ అధికారి కేఎస్ఎంవీ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాల యజమానులు https://vahan.parivahan.gov.in/AFMS వాహన సర్వీస్ ఆధార్‌తో రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు జమ చేసి స్లాట్ పొందాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అండ్ హైవేస్ నిర్ణయం ప్రకారం రవాణాశాఖ ఫిట్‌నెస్ వెరిఫికేషన్‌ను నిలిపివేసినట్లు కృష్ణారావు తెలిపారు.

అర గంటలో ఆమోదం

ఏలూరు కౌన్సిల్ సమావేశం.. అంతా ఏకపక్షం

- అజెండాలోని 18 అంశాలపైన అభ్యంతరాల్లేవు
- ఎలాంటి చర్చా చేపట్టని పాలక, ప్రతిపక్షాలు
- **రూ.453 కోట్లతో నగర సుందరీకరణ**
- రూ.291 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు
- రూ.49 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు
- ట్రేడ్ లైసెన్సు రుసుం పెంపు : మేయర్ నూర్జహాన్



మాట్లాడుతున్న కో ఆప్షన్ సభ్యుడు పెదబాబు

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం మంగళవారం నిస్సారంగా సాగింది. కౌన్సిల్‌కు హాజరైన 36 మంది సభ్యులు నిశ్శబ్దంగా కూర్చున్నారు. సూపరింటెండెంట్ సిరాజుద్దీన్ అజెండాలోని 18 అంశాలను ఒక్కొక్కటి చదువుతుంటే అందరూ తలలు ఊపారు. మేయర్ బెల్ నొక్కారు. అర గంటలోపే చదవడం, సభ అంగీకరించటం జరిగింది. కౌన్సిల్‌లో మెజారిటీ సభ్యులు టీడీపీ వారే. కొందరు ప్రతిపక్ష సభ్యులు వున్నప్పటికి వారు మాట్లాడలేదు. ఈ అంశాలపై సభ్యులు ముందే మాట్లాడుకుని ఓకే చెప్పడం మినహా సభలో ఏ పాయింట్‌పైన కూడా చర్చించలేదు.

నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ 'కూటమి ప్రభుత్వం వచ్చిన 17 నెలల్లో సుపరిపాలన అందించాం. నగరాభివృద్ధే ధ్యేయంగా అజెండాలో ప్రవేశ పెట్టిన 18 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించడమే దీనికి నిదర్శనం. షెడ్యూల్ కులాల నిర్వాసిత ప్రాంతాల్లో రోడ్లు, మౌలిక సదుపాయల కల్పనకు కోటి రూపాయలు కేటాయించాం. ఆదాయం పెంచుకునే మార్గంలో ట్రేడ్ లైసెన్సుల రుసుమును 33 1/3శాతం పెంచబోతున్నాం. ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య కృషితో కార్పొరేషన్‌కు వచ్చిన రూ.453 కోట్లతో నగరాన్ని సుందరీకరిస్తున్నాం. గ్రాంట్లు, జనరల్ ఫండ్స్ రూ.49 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు నిర్మించాం. అమృత్ పథకంలో రూ.291 కోట్లతో విలీన గ్రామాలకు తాగు నీరందించడానికి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు అందిస్తున్నాం. రాబోయే రోజుల్లో నగరాన్ని మరింత అభివృద్ధి పరుస్తాం' అని అన్నారు. డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యులు చోడే వెంకట రత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్, ఎంఈ సురేంద్రబాబు, డీఈలు, ఏఈలు, మేనేజర్ మూర్తి పాల్గొన్నారు.

అజెండాలోని అంశాలు

- గత కౌన్సిల్‌లో అజెండాలోని పది అంశాలను ధ్రువీకరించారు. 27వ డివిజన్ దొండపాడును గ్రామ పంచాయతీగా ఏర్పాటుకు తీర్మానించారు.
- ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కోటి రూపాయలతో సీసీ రోడ్లు
- అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల పెంపు
- స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఏవీ నారాయణ రాజీనామాకు ఆమోదం
- స్ట్రోమ్ వాటర్ డ్రైనేజీ డీపీఆర్ తయారీకి సీఐఎస్టీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు అప్పగింత
- స్థానిక సంస్థ ఎన్నికల ఖర్చులకు రూ.80 లక్షలతో ప్రతిపాదనలు
- ట్రేడ్ లైసెన్స్ ఫీజులు 33 1/3 శాతం పెంపు
- ఆఫీస్ సబార్డినేట్ ఎం.కాశీవిశ్వనాధం బదిలీకి ఆమోదం
- నగరంలో విలీనమైన వెంకటాపురంలోని వెంచర్లు నగర పాలక సంస్థ స్వాధీనం చేసుకుంటుంది.
- గ్యాంగ్ మజూర్ ప్రవీణ్‌బాబును బదిలీ
- నగరంలో మూడు ప్రైమరీ హెల్త్ సెంటర్ల ఆధునీకరణకు రూ.3 కోట్లతో ప్రతిపాదనలు
- పొల్యూషన్ స్థాయిలను నివారించడానికి రూ.6 కోట్ల 57 లక్షలు కేటాయింపు
- మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పీఎఫ్ చెల్లింపునకు ఆమోదం
- తుదిమెళ్లలో వంట బోదే స్థలం కేటాయింపు
- హార్టికల్చర్ సూపర్‌వైజర్ ఉద్యోగ కాలం ఏడాది పొడిగింపు.
- నగరంలో విలీనం కాక ముందు ఏడు గ్రామాల్లో బకాయిపడిన రూ.34 కోట్ల కరెంటు బిల్లులు చెల్లించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఆప్కాస్ ఉద్యోగులకు జీతాలు పెంపునకు ఆమోదం.

ప్రత్యేక పంచాయతీగా దొండపాడు

ఏలూరు రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏలూరు 27వ డివిజన్‌లో దొండపాడును ప్రత్యేక పంచాయతీగా చేస్తూ నగర పాలక సంస్థ కౌన్సిల్ తీర్మానించింది. దీంతో దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలంలోని దొండపాడు ప్రత్యేక పంచాయతీగా ఆవిర్భవించనుంది. 2020లో ఏలూరు రూరల్ గ్రామాల్లో శనివారపుపేట, సత్రంపాడు, చొదిమెళ్ల, తంగెళ్లమూడి, పోణంగి, వెంకటాపురం, కొమరవోలు గ్రామాలను ఏలూరు కార్పొరేషన్‌లో విలీనం చేస్తూ 2022లో వైసీపీ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేసింది. చొదిమెళ్ల పంచాయతీ పరిధిలోని దొండపాడు, శనివారపుపేటను 27వ డివిజన్ చేశారు. ఈ డివిజన్‌లో కొంత గ్రామంగా, మరికొంత కార్పొరేషన్‌లో వుండడంతో పరిపాలన గందరగోళంగా వుండేది. దీంతో ఈ గ్రామాన్ని కార్పొరేషన్ నుంచి తొలగించి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. గ్రామంలో 2,700 మంది ఉన్నారు. పంచాయతీ కావడంతో ఇక్కడ అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మేయర్ నూర్జహాన్

సీఎం పర్యటనలో వినతులను పరిష్కరించండి : కలెక్టర్ వెట్రి సెల్వి

ఏలూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):జిల్లాలో సీఎం, డిప్యూటీ సీఎంల పర్యటనల సమయంలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ కె వెట్రిసెల్వి అధికారులను టెలి కాన్ఫరెన్స్‌లో మంగళవారం ఆదేశించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పలుమార్లు విచ్చేసిన సమయంలో ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో తెలియజేశారన్నారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించామని, వాటిని వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జేసీ ఎంజే అభిషేక్ గౌడ, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, జెడ్పీ సీఈవో శ్రీహరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులకు సీఐడీ నోటీసులు

పాలకొల్లు టౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి):వైసీపీ ప్రభుత్వ హయాంలో పాలకొల్లు టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేసే సమయంలో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడిపై దాడి చేసిన నాయకులు సీఐడీ నోటీసులు జారీచేసింది. నాటి ఎమ్మెల్యే నిమ్మల, ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ సభా వేదికపైకి రాకుండా అడ్డుకుని దాడి చేసిన నాయకులకు సీఐడీ అధికారులు మంగళవారం నోటీసులు అందజేశారు. వీరిలో గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, బండి రమేష్, చందక సత్తిబాబు, ఖండవల్లి వాసు, మానుకొండ శ్రీనుబాబు, ఉచ్చుల స్టాలిన్, గవర సర్వేశ్వరరావు, కోట రత్నరాజు, లంకే శ్రీను ఉన్నారు. వారంతా రాజమండ్రిలోని సీఐడీ కార్యాలయానికి రోజుకొకరు రావాలని పేర్కొన్నారు.

రూ.8.41 లక్షల విలువైన బియ్యం, పంచదార సీజ్.. రేషన్ డీలర్లపై కేసులు

గ్రామాల మధ్య చిచ్చు పెడితే సహించను
అటవీ భూములను ఆక్రమిస్తే చర్యలు : మంత్రి సారథి

పూళ్లలో నడిరోడ్డుపై దారుణ హత్య 5

సొంతింటి కల సాకారమయ్యేలా

- జిల్లావ్యాప్తంగా 48,769 దరఖాస్తులు
- ఆవాస్ + యాప్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక



పీఎంఏవై దరఖాస్తులకు నేటితో పూర్తి కానున్న గడువు

ఏలూరు సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన-ఎన్టీఆర్ హౌసింగ్ స్కీం పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఈ పథకంలో దరఖాస్తుల గడువు బుధవారంతో ముగియనుంది. కొత్తగా ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణాలకు గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవటానికి గత నెల 30తోనే ముగిసింది. అయినప్పటికి ఆవాస్ ప్లస్ 2024 సర్వే కొనసాగుతుండటంతో ఈ గడువును మరో మూడు రోజులు పొడిగించారు. ఇప్పటికే ఏలూరు జిల్లాలో 48 వేల 769 మంది దరఖాస్తు చేసుకున్నారు. సొంత స్థలం ఉండి, ఇళ్లు కావాల్సిన వారు, సొంత స్థలం లేని వారు ఈ పథకంలో దరఖాస్తు చేసుకోవచ్చు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ హౌసింగ్ స్కీంలో ఇళ్ల నిర్మాణాలను అసంపూర్తిగా పూర్తిచేసిన వారికి మిగిలిన భాగం పూర్తి చేయటానికి దరఖాస్తులు కోరుతున్నారు.

పేదల ఇళ్ల నిర్మాణాలు రెండు విధాలుగా చేపడుతోంది. సొంత స్థలం ఇల్లు నిర్మించుకునే వారికి ఆర్థిక సాయం చేస్తారు. స్థలం లేకపోతే గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలాన్ని కేటాయించి, ఇంటి నిర్మాణాన్ని చేపడతారు. ఈ పథకం కోసం గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. సొంత స్థలం ఉన్న, లేని వారి వివరాలను అధికారులు సేకరిస్తున్నారు.

ఆవాస్ + యాప్‌లో నమోదు

ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారుల ఎంపికకు కేంద్రం ఆవాస్+ ప్రత్యేక యాప్‌ను తీసుకువచ్చింది. రాష్ట్రంలో అర్హులను గుర్తించే బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణ శాఖ ఏఈలకు అప్పగించింది. వీరు ఇంటింటికీ వెళ్లి అర్హులను గుర్తించి, దరఖాస్తుదారు ప్రస్తుతం ఉంటున్న ఇల్లు, లోకేషన్ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. కొత్తగా ఎక్కడ ఇంటి నిర్మాణం చేపడతారో ఆ స్థలాన్ని ఫొటో తీసి, దరఖాస్తుదారు ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ముఖ గుర్తింపును యాప్ క్యాప్చర్ చేసిన వెంటనే ఆధార్ కార్డు ఆటోమేటిక్‌గా డిస్‌ప్లే అవుతుంది. జాబ్ కార్డు వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు తీసుకుంటారు. దరఖాస్తుదారుల్లో మొదట అత్యంత పేదలకే ఇల్లు మంజూరయ్యేలా యాప్‌ను కేంద్ర ప్రభుత్వం డిజైన్ చేసింది. యాప్‌లో నమోదైన వివరాల ఆధారంగా అర్హుల జాబితా సిద్ధం కానుంది. ఒంటరి మహిళలు, వితంతువులకు ప్రాధాన్యం ఇస్తారు. రాష్ట్ర ప్రభుత్వం యాప్ ద్వారా నమోదు చేసిన వారి వివరాలను కేంద్రానికి నివేదించనున్నారు. అక్కడ మరోసారి పరిశీలించి తుది జాబితాకు అనుగుణంగా ఇల్లు మంజూరవుతుంది.

జిల్లాకు వెల్లువెత్తిన దరఖాస్తులు

పీఎంఏవై గ్రామీణ్ యోజన కింద ఇప్పటి వరకు 48 వేల 769 దరఖాస్తులు వచ్చాయని జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారులు చెప్పారు. నేటితో గడువు ముగుస్తుండటంతో అర్హులు సచివాయాల్లో దరఖాస్తు చేసుకోవాలి.

మండలాల వారీగా దరఖాస్తులు

						టి.నరసాపురం	1,229
పెదవేగి	5,163					కలిదిండి	1,144
పెదపాడు	3,369	ద్వారకాతిరుమల	2,329	చింతలపూడి	1,706	ముదినేపల్లి	892
చాట్రాయి	3,187	ఏలూరు	2,239	పోలవరం	1,587	నిడమర్రు	776
నూజివీడు	2,808	ఆగిరిపల్లి	1,859	ముసునూరు	1,554	భీమడోలు	698
దెందులూరు	2,538	జీలుగుమిల్లి	1,763	కైకలూరు	1,435	మండవల్లి	579
కొయ్యలగూడెం	2,475	లింగపాలెం	1,757	ఉంగుటూరు	1,414	కుక్కునూరు	395
బుట్టాయిగూడెం	2,484	జంగారెడ్డిగూడెం	1,733	కామవరపుకోట	1,290	వేలేరుపాడు	366

నేటి నుంచి నందమూరు ఆంజనేయస్వామి ఉత్సవాలు



వీరవాసరం (భీమవరంటౌన్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వీరవాసరం మండలం నందమూరుగరువు శ్రీరామ భక్తాంజనేయస్వామి హనుమద్వ్రత 60వ వార్షికోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 3వ తేదీ నుంచి 15 వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 15వ తేదిన అఖండ అన్నసమారాధన ఉంటుందన్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ప్రత్యేకంగా అలంకారం చేసిన హంస వాహనంపై స్వామివారి ఊరేగింపు జరుగుతుందని ఊరేగింపును ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ప్రారంభిస్తారని వివరించారు. సాయంత్రం ఆలయం వద్ద భారీ బాణసంచా కాల్పులు ఉంటాయన్నారు. 3వ తేదీ సాయంత్రం బాలనాగమ్మ వెరైటీ బుర్రకథ, 4న సినీ సంగీత విభావరి, 5న బాలనాగమ్మ నాటకం. 6న సినీ సంగీత విభావరి, 7న సినీ సంగీత విభావరి, 8న ఇంద్ర జాల ప్రదర్శన, తదుపరి అన్నమయ్య నాటకం, 9న సినీ సంగీత విభావరి, 10న రంగస్థల ఘట్టములు, 11న సినీ సంగీత విభావరి, 12న చింతామణి నాటకం, 13న సినీ సంగీత విభావరి, సాయంత్రం స్వామివారి లడ్డూ వేలంపాట జరుగుతాయి. 14న కూచిపూడి నృత్య ప్రదర్శన, ద్వి రత్నాలు నాటకాలు, 15న అఖండ అన్నసమారాధన, సాయంత్రం దిద్దుకూరి సాయిబాబు ఆధ్వర్యంలో సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శిస్తారని తెలిపారు. నిర్వాహకులు కొప్పినీడి శ్రీనివాసరావు, మేకల వెంకటచలపతిరావు, నక్కెళ్ళ అప్పారావు, వడ్డీ కనదుర్గాప్రసాద్, పులగం గున్నయ్య, కొప్పినీడి సత్యనారాయణ, కృష్ణ ఏర్పాట్లు చేస్తున్నారు.



కోట శంకరరావును సత్కరిస్తున్న దృశ్యం

కళా రంగాన్ని ప్రోత్సహించాలి

సినీ నటుడు కోట శంకరరావు

వీరవాసరం, (భీమవరంటౌన్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కళారంగాన్ని, కళాకారులను ప్రోత్సహించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో కళా పరిషత్‌ల ద్వారా నాటక ప్రదర్శనలు ఏర్పాటు చెయ్యటం అభినందనీయమని ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు కోట శంకరరావు అన్నారు. తోలేరు శ్రీసుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన 21వ జాతీయ స్థాయి నాటిక పోటీల బహుమతి ప్రధానోత్సవ సభను పరిషత్ అధ్యక్షుడు చవాకుల సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ సమాజంలో జరిగే వాస్తవిక పరిస్థితులను కళ్లకు చూపించగలిగేవి నాటకాలేనని అన్నారు. శాసన మండలి చైర్మన్ కొయ్యే మోసేనురాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ అంతరించిపోతున్న నాటక రంగాన్ని బ్రతికించేందుకు కళాపరిషత్‌ల నిర్వాహకులు సహకరించాలన్నారు. తదుపరి సినీ నటుడు కోట శంకరరావు, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక నాటక పరిషత్ సమాఖ్య అధ్యక్షుడు బుద్ధాల వెంకట రామారావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పోలిశెట్టి సత్యనారాయణ(దాసు),వీరవాసరం, రాయకుదురు కళాపరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ, కేఎస్ఆర్కే గోపాలకృష్ణ, తది తరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళా స్రవంతి విశాఖపట్నం వారి (అ) సత్యం, ఉత్తమ ద్వితీయ ప్రదర్శన గోవాడ ఆర్ట్ క్రియేషన్స్ హైదరాబాద్ వారి అమ్మ చెక్కిన బొమ్మ, ఉత్తమ తృతీయ ప్రదర్శన అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేఘం నిలిచింది.

చెమట నీరు చిందగా నుదుటి రాత మార్చుకోలేనిదేది లేదని గుర్తించుకో.. పిడికిలే బిగించగా చేతి గీత మార్చుకో మారిపోని కథలే లేవని గమనించుకో.. దివ్యాంగుల్లో మనోస్థైర్యాన్ని నింపుతూ ఓ సినీ కవి రాసిన గీతమిది. వీటిని వీరు ఆచరించి చూపిస్తున్నారు. తమ లోపాన్ని మరిచిపోయారు. లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కళ్లు లేవని కలత చెందలేదు. కాళ్లు లేవని వెనకడుగు వేయలేదు. ఎందులోను తక్కువ కాదని నిరూపిస్తూ ముందడుగు వేస్తున్నారు. డిసెంబరు 3న అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడల్లో రాణిస్తున్న దివ్యాంగులపై కథనం.. - ఏలూరు రూరల్(ఆంధ్రజ్యోతి)

విధిని గెలిచి.. ఆటల్లో మెరిసి

క్రీడల్లో రాణిస్తున్న దివ్యాంగులు.. నేడు అంతర్జాతీయ విభిన్నప్రతిభావంతుల దినోత్సవం

పరుగు పెడితే పతకమే..



టి.మోహనకుమారి పుట్టుకతో చెవిటి, మూగ అయినా ఆమె మనోధైర్యాన్ని కోల్పోలేదు. మాట లేదన్న భావన వీడి ఇష్టం ఉన్న క్రీడారంగంలో ప్రవేశించింది. పరుగు పందెంలో పతకాలు సాధిస్తోంది. ఒకటి రెండు కాదు.. పదుల సంఖ్యలో పతకాలు గెలుచుకుంది. పాల్గొంటే పతకం సాధించాల్సిందేనన్న రీతిలో గుర్తింపు తెచ్చుకుంది. చిన్ననాటి నుంచి ఇష్టమున్న క్రీడల్లో రాణిస్తోంది. 2018 నుంచి క్రీడా యాత్ర సాగిస్తుంది. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించడం మొదలు పెట్టింది. పరుగుతో పాటు సాఫ్ట్‌బాల్, త్రోబాల్, పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుతుంది. తాజాగా జరిగిన దివ్యాంగుల క్రీడా పోటీల్లో పథకాలు సాధించింది.

విజయమే శ్వాసగా..



కాలు అవిటితనం ఉన్నా ఆత్మ విశ్వాసాన్ని వదులుకోలేదు. దివ్యాంగత్వం వచ్చినా కుంగిపోలేదు. ఏలూరుకు చెందిన ఎ.మన్విత్ చౌదరి ఈత కొలనులో సాధన చేసి పట్టు సంపాదించారు. పారా క్రీడల్లో పాల్గొంటున్నాడు. ఇటీవల ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. జూన్‌లో జూనియర్ విభాగంలో 100మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో 200 మీటర్లు ఇండివిడ్యువల్, 50 మీటర్లు బటర్‌ఫ్లై విభాగంలో వెండి పతకాలు సాధించాడు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు.

పోటీ పడితే పతకమే..



కళ్లు లేవని కలత చెందలేదు.. కృషికి పట్టుదలను జోడించి సాధన చేస్తే ఏ రంగంలోనైనా రాణించవచ్చని అంధ యువతి గుజ్జుల రాధారాణి నిరూపించారు. అందరిలా అవయవాలు సరిగా లేకపోయినా అధైర్య పడకుండా ముందుకు కదిలారు. తమకు ఇష్టమైన క్రీడల్లో సాధన చేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటారు. ఇటీవల జరిగిన దివ్యాంగుల పోటీల్లో జావలిన్‌త్రో, డిస్కస్ త్రో, షాట్‌పుట్ పోటీల్లో పతకాలు సాధించింది. ప్రస్తుతం ఆమె ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ విజువల్లి ఛాలెంజడ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యనిర్వాహ కార్యదర్శిగా సేవలందిస్తున్నారు.

దివ్యాంగులకు స్ఫూర్తి సదాశివమూర్తి



ఆవు వెనుక కాలును సిద్ధం చేసిన మూర్తి

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు స్ఫూర్తిగా నిలిచారు సదాశివమూర్తి. రెండు కాళ్ళు మోకాళ్ళ వరకు తొలగించినప్పటికీ పట్టుదలతో అవయవలోపాన్ని అధిగమించి, ఎందరికో మానసిక స్థైర్యం ఇస్తున్న సదాశివమూర్తి కథనం ఇది. మనలో ఉన్నలోపాలను తలచుకోకుండా ఆత్మస్థైర్యంతో ఉండాలని చైతన్య కృత్రిమ అవయ కేంద్రం నిర్వాహకుడు డాక్టర్ వేదాంతం సదాశివ మూర్తి అన్నారు. 1981 నవంబరు 25వ తేదీన (తన 25వ ఏట) తన పుట్టిన రోజునే పాలకొల్లు రైల్వే స్టేషన్‌లో జరిగిన ప్రమాదంలో రెండు మోకాళ్ల వరకు కోల్పోయిన సదాశివమూర్తి ఆత్మనిబ్బరంతో నిలిచి తన స్నేహితులు డాక్టర్ చల్లా మల్లిఖార్జున శర్మ, డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జీ), దొడ్డిపట్లకు చెందిన సీవీవీ సత్యనారాయణ మూర్తి తదితరులతో పాటు తన భార్య సుందరి అందించిన సహకారంతో కృత్రిమ కాళ్లతో పని చేస్తున్నారు. కాళ్లు లేకున్నా చూడటానికి సదాశివమూర్తి బులెట్ మోటారు నడపడమే కాకుండా బులెట్ మెకానిజం చేస్తుంటారు. కారు నడపడంతోపాటు సాధారణ వ్యక్తి మాదిరిగా ఉంటారు. ఇంకా 1999 నవంబరు 25వ తేదీన పాలకొల్లులో కృత్రిమ అవయవ కేంద్రం నెలకొల్పారు. ఇప్పటికీ 26 ఏళ్లుగా 12 వేల మందికి పైగా కాళ్లు, చేతులు అమర్చడం జరిగిందని, వీరిలో ఐదేళ్ల చిన్నారులకు ఉచితంగానే అవయవాలను అందిస్తున్నట్టు సదాశివమూర్తి తెలిపారు. మనుష్యులతో పాటు ఆవులకు కాళ్ళు అమర్చుతున్నట్టు తెలిపారు. తన స్వయం కృషితో గృహాల్లో వినియోగించే పరికరాలు పలు రూపొందించారు. వెనక్కి తిరిగే గడియారం తయారు చేశారు మూర్తి. ఈవిధమైన సేవల ద్వారా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు

ఎట్టకేలకు క్రీడాకారులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నూజివీడు టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని త్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నూజివీడు క్రీడాకారులు ఎట్టకేలకు సీట్లు సాధించారు. బాస్కెట్‌బాల్‌లో జాతీయ స్థాయి వరకు క్రీడల్లో పాల్గొన్న నూజివీడు విక్టోరియా టౌన్ హాల్‌కు చెందిన క్రీడాకారులు ధృవ పత్రాలను సాప్ ధృవీకరణలో ఆలస్యం అవడంతో ప్రధాన కౌన్సెలింగ్‌లో సీట్లును సాధించలేకపోయారు. ఈనేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో సెప్టెంబరు 20న 'శాప్ నిర్లక్ష్యం ఉన్నత చదువుకు దూరం' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. తమకు జరిగిన అన్యాయాన్ని వీసీ ఎండి ఎస్.భరణి, ఆర్జీయూకేటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళగా క్రీడాకారుల అభ్యర్థిత్వాన్ని తిరిగి పరిశీలించడంతో రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఉన్నతాధికారులు, క్రీడాకారులకు నూజివీడు త్రిపుల్ ఐటీ పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో ప్రవేశాలను కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో నూజివీడు సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన బి.ప్రణవి, విస్డం పాఠశాలకు చెందిన షేక్ ఆశ్ర, నూజివీడు బాలికోన్నత పాఠశాలకు చెందిన బి ప్రభుదీపికలు మంగళవారం త్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో అడ్మిషన్లు పొందారు. ఈమేరకు నూజివీడు త్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్ క్రీడాకారులకు ఐడీ కార్డులను అందించారు.

మద్ది ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):గుర్వాయిగూడెం మద్ది అంజనేయస్వామిని మంగళవారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనార్థం వచ్చిన సుమారు 2113 మంది భక్తులకు నిత్యాన్నదాన సత్రంలో అన్నప్రసాదాన్ని అందజేసినట్టు దేవస్థాన ఈవో చందన తెలిపారు.

నేషనల్ జంబోరిలో గురుకుల విద్యార్థుల ప్రతిభ



గురుకుల విద్యార్థుల టీమ్‌కు మెమెంటో ఇస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్కౌట్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే నేషనల్ జంబోరిలో పెద తాడేపల్లి గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరిచి చరిత్ర సృష్టించారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన గురుకుల విద్యార్థులు నవంబర్ 23 నుంచి 29 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో జరిగిన ఈ జంబోరిలో దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 20వేల మంది స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు. మన జిల్లా నుంచి 450 మంది విద్యార్థులు హాజరు కాగా వారు పాల్గొన్న 10 పోటీల్లో 9 విభాగాల్లో మంచి గ్రేడ్‌లు సాధించి చరిత్ర సృష్టించారు. బ్యాండ్ ప్రదర్శనలో ఏ గ్రేడ్, మిగిలిన క్రీడల్లో మంచి గ్రేడ్‌లు సాధించారు. విజేతలను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అభినందించారు. విద్యార్థులకు ప్రయాణ ఖర్చులు అందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు ప్రిన్సిపాల్ బి.రాజారావు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థుల అభినందనలో పాల్గొన్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు

రగ్బీలో కేపీ పాలెం విద్యార్థుల ప్రతిభ

మొగల్తూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల నెల్లూరులో జరిగిన రగ్బీలో కెపిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు జి.దానియేలు, బి.నాగేంద్ర పశ్చిమగోదావరి జిల్లా జట్టు తరపున అండర్ 17 బాయ్స్ తరపున ప్రాతినిధ్యం వహించి ప్రతిభ కనబర్చడంతో దానియేలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం పితాని ఇందిర తెలిపారు. డిసెంబర్ నెలలో భువనేశ్వర్‌లో జరిగే అండర్ 17 జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో దానియేలు, నాగేంద్రలను వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు గుత్తుల జయ కుమార్‌లను అభినందించారు.

'చెత్త తొలగింపుతో అనారోగ్యాలు రావు'


తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆయుష్షు, ఆరోగ్యం అందించేందుకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం దోహదపడుతుందని సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కోఆర్డినేటర్ జి.ప్రసంగిరాజు పేర్కొన్నారు. ఇళ్లు, రోడ్లపై చెత్త తొలగింపు వల్ల అనారోగ్యాలు దరిచేరవని అన్నారు. మారంపల్లి సుప్రీమ్ లోకల్ ట్రైనింగ్ సెంటర్‌గా ఎంపిక కావడంతో అక్కడ మంగళవారం అవగాహన నిర్వహించారు. ఎంపీడీవో వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్‌లకు అందించాలని సూచిం చారు. కార్యక్రమంలో సర్పంచ్ సరిపల్లె పద్మ చిట్టిబాబు, కూటమి నాయకులు మిద్దే కనకారావు, తోట సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

బొమన్ సాబ్ లుక్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాజాసాబ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. జనవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రంలో అతీంద్రియ శక్తుల పరిశోధకుడిగా బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ కీలక పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్‌గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను రూపొందిస్తున్నారు దర్శకుడు మారుతి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు.



కథను మలుపుతిప్పే పాత్ర పోషించాను



- సంయుక్త

'అఖండ 2: తాండవం' చిత్రంలో అవకాశం వచ్చినప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఒక మంచి సినిమాలో అవకాశం వస్తే తిరస్కరించకూడదు అని భావించి డేట్స్ అడ్జెస్ట్ చేసుకొని నటించాను. ఈ సినిమాలో కథను మలుపు తిప్పే పాత్ర పోషించాను' అని సంయుక్త అన్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. నందమూరి తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక సంయుక్త సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- "అఖండ 2: తాండవం' చిత్రం 'అంచనాలకు మించి ఉండబోతోంది. బోయపాటి గారు గ్రేట్ విజన్‌తో తెరకెక్కించారు. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి.
- ఈ చిత్రంలో నా పాత్ర చాలా కీలకంగా, స్టైలిష్‌గా ఉంటుంది. నా కెరీర్‌లో తొలిసారి ఓ మాస్ సాంగ్ చేశాను. ఇలాంటి మాస్ సాంగ్ ఇప్పటివరకూ చేయలేదు. చాలా కష్టపడ్డాను. ప్రాక్టీస్ చేసే సమయంలో మోకాలు దెబ్బతిని సహకరించకపోవడంతో ఫిజియోథెరపీ చేయించుకున్నా.
- బాలకృష్ణ గారు దర్శకుల నటుడు. వారు ఎలా చెబితే అలా చేస్తారు. నటుడిగానూ ఆయన విజన్ అద్భుతం. సెట్‌లో ఆయన చాలా స్నేహంగా ఉండేవారు. ఆయన నటించిన 'డాకూ మహరాజ్' నా ఫేవరేట్ చిత్రం.
- తమన్ సంగీతం, ముఖ్యంగా సంస్కృత శ్లోకాలతో సాగే నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. మా నిర్మాతలు రామ్, గోపీ గారు మేకింగ్‌లో రాజీ పడలేదు. సినిమాను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కథానాయికగా స్వయంభు, నారీ నారీ నడుమ మురారి చిత్రాలు చేస్తున్నాను.

అఖండ 2 టికెట్ ధరల పెంపు

- ఏపీ ప్రభుత్వ అనుమతి

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2' సినిమా టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం అనుమతిచ్చింది. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతోంది. నిర్మాతల వినతి మేరకు భారీ బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి జారీ చేస్తోంది. అందులో భాగంగానే ఈ సినిమా విడుదలైన తొలి పది రోజులు టికెట్ ధరలు పెంచుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు పూర్తి అనుమతి లభించింది. సింగిల్ స్క్రీన్లలో సాధారణ రేటుపై రూ. 75, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 100 పెంపునకు అనుమతించింది. ఈ నెల నాలుగున ప్రదర్శించే ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 600గా నిర్ణయించారు.

విందు భోజనంలా ఎంజాయ్ చేసే సినిమా



క్రికెట్ క్రీడ నేపథ్యంలో కామెడీ ప్రధానాంశంగా రూపుదిద్దుకున్న చిత్రం 'గేట్'. సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించారు. ఎం. చంద్రశేఖర్ నిర్మించారు. మంగళవారం నిర్మాత దిల్‌రాజు టీజర్‌ను విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాం. మంచి అభిరుచితో చేసిన సినిమా ఇది. ప్రేక్షకులు విందు భోజనంలా ఎంజాయ్ చేస్తారు. మణిశర్మ నేపథ్య సంగీతం సినీ ప్రియులను మెప్పిస్తుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. సహ నిర్మాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాను మాస్ ఎంటర్‌టైనర్‌గా తీశాం. చంద్రశేఖర్ రెడ్డి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు' అని తెలిపారు. ఆద్యంతం వినోదం పంచే చిత్రమిదని దివ్యభారతి తెలిపారు.

యువతకు కనెక్ట్ అయ్యే కథ



రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథా చిత్రం 'సైక్ సిద్ధార్థ్'. శ్రీనందు, యామిని భాస్కర్ జంటగా నటించారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీనందు, శ్యామ్ సుందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీనందు మాట్లాడుతూ 'ఇప్పుడున్న సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథతో తెరకెక్కిన చిత్రమిది. సురేశ్‌బాబు గారు సినిమా చూసిన వెంటనే పంపిణీ చేసేందుకు అంగీకరించారు. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను తీసుకోవడంతో నా కల నెరవేరినట్లయింది' అని చెప్పారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు చక్కని ప్రేక్షకాధరణ దక్కింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్క్రీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అని చెప్పారు.

అనుమాన పక్షి వచ్చేది అప్పుడే



రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలక ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. వినోద ప్రధానంగా సాగే ఈ సినిమా విమల్ కృష్ణ మార్క్‌తో స్టైలిష్‌గా ఉండనుందని చెప్పారు. రాగ్ మయూర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. అతిగా ఆలోచిస్తూ, అతి జాగ్రత్తతో ఉండే ఆయన రోల్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాక, కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ అన్నారు. బ్రహ్మాజీ, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: సునీల్‌కుమార్ నామా, సంగీతం: శ్రీచరణ్ పాకాల.


ప్రేమ కోసం యుద్ధం



రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా 'కలర్ ఫొటో' ఫేమ్ సందీప్ రాజ్ తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. మంగళవారం చిత్రం ట్రైలర్‌ను హీరోయిన్ రష్మిక మందన్న విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్‌లో పాత్రలను, కథా నేపథ్యాన్ని పరిచయం చేసిన విధానం ఆకట్టుకుంది. 'తన ప్రేమ కోసం యుద్ధం చేసే ప్రతీవాడు హీరోనే' అంటూ కథానాయకుడు పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. బండి సరోజ్‌కుమార్ ఈ సినిమాలో విలన్‌గా నటించారు. హర్ష చెముడు కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామ మారుతి ఎమ్, సంగీతం: కాలభైరవ.

కాంతారపై కామెడీ

రణ్‌వీర్ క్షమాపణలు



కాంతార చిత్రంపై తాను చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ మంగళవారం క్షమాపణలు చెప్పారు. ఎవరినీ కించపరచడం తన ఉద్దేశం కాదని తెలిపారు. 'రిషబ్ శెట్టి బాగా నటించారని చెప్పడం కోసమే నేను అలా నటించాను. అలాంటి సన్నివేశాల్లో నటించాలంటే చాలా కష్టం. అయినా ఏ ఇబ్బంది లేకుండా అటువంటి సన్నివేశాలను ఎంతో ఈజ్‌తో చేసే ఆయనంటే నాకు చాలా ఇష్టం. మన దేశంలోని ప్రతీ సంప్రదాయం మీద నాకు అపారమైన గౌరవం ఉంది. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొన్నారు. 'కాంతార'పై రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై హిందూ జనజాగృతి సమితి ఫిర్యాదు చేసింది. ఆయన చేసిన కామెంట్స్ హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని పేర్కొంది. గోవాలో ఇటీవలె ముగిసిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో రణ్‌వీర్ 'కాంతార' చిత్రంపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వేదికపై మాట్లాడుతూ "కాంతార' సినిమాలో రిషబ్ శెట్టి నటన అద్భుతం. హీరో పాత్రలోకి దెయ్యం ప్రవేశించినప్పుడు వచ్చే సన్నివేశాలు చాలా బాగున్నాయి" అని రణ్‌వీర్ పేర్కొన్నారు. ఆ సినిమాలో ఎంతో పాపులర్‌గా మారిన 'ఓ' అనే శబ్దాన్ని స్టేజీపై అనుకరించారు. దేవతను ఆయన దెయ్యంగా పోల్చాడని కర్ణాటక వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.

వినూత్నంగా వన్ బై ఫోర్



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో తెరకెక్కిన కామెడీ థ్రిల్లర్ 'వన్ బై ఫోర్'. వెంకటేశ్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్ జంటగా నటించారు. బాహుబలి పళని కె. దర్శకత్వంలో రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ క్రైమ్ డ్రామాను తీశాం. పళని గారి టేకింగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. 'హారర్, సస్పెన్స్ అంశాలు, పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ అంశాలతో పాటు మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్' అని చెప్పారు. కథ మీద నమ్మకంతో ఈ చిత్రాన్ని నిర్మించాం, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని నిర్మాతలు తెలిపారు.

విడుదలకు సిద్ధం



భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'విధాత'. మణికంఠ రాజేంద్రబాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించారు. విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ 'ఇదో వైవిధ్యభరితమైన చిత్రం. పాత్రలన్నీ సహజ సిద్ధంగా ఉంటాయి' అని అన్నారు. 'ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాము' అని అప్పిని పల్లె భాస్కర చారి తెలిపారు.

సబ్జెక్టు టీచర్ల కొరతకు చెక్

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి ప్రభుత్వం ఉత్తర్వులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో జీరో సబ్జెక్టు టీచర్ల కొరతను భర్తీచేయడానికి తాత్కాలిక ప్రాతిపదికన ఐదు నెలల కాలానికి అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని విద్యా శాఖ నిర్ణయించింది. ఆ మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 22 మంది స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయుల కొరతను భర్తీ చేయడానికి విద్యాశాఖ ప్రతిపాదించగా, కొత్త జిల్లాల ప్రకారం నియామకాలను చేపట్టడానికి ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 8 నుంచి వచ్చే ఏడాది మే 7 వరకు ఈ తాత్కాలిక నియామకాల కాలపరిమితిగా నిర్ధారించారు. మండల స్థాయిలో దరఖాస్తులను స్వీకరించి, తుది నియామకాలను ఈ నెల 6 లోగా పూర్తి చేసి, 8వ తేదీ నుంచి అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు సంబంధిత పాఠశాలల్లో విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నియమితులైన ఎస్జీటీలకు నెలకు రూ.10 వేలు, స్కూల్ అసిస్టెంట్ కేడర్ వారికి రూ.12,500లు గౌరవ వేతనంగా సమగ్ర శిక్ష బడ్జెట్ నిధుల నుంచి చెల్లిస్తారు. ఉమ్మడి జిల్లా విద్యాశాఖ ప్రతిపాదించిన 22 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులను కొత్త జిల్లాల ప్రకారం విభజిస్తే ఏలూరు జిల్లాకు 4, పశ్చిమగోదావరి-10, తూర్పుగోదావరికి-8 ఉన్నాయి. ఏలూరు జిల్లాలోకి విలీనమైన ఉమ్మడి కృష్ణాజిల్లా మండలాలకు కేటాయించిన పోస్టులను కలిపి మొత్తం 7 స్కూల్ అసిస్టెంట్ కేడర్ నియామకాలకు నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. ఆ ప్రకారం ఏలూరు నగరపాలక సంస్థ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉర్దూ మాధ్యమంలో 4 పోస్టులు, కైకలూరు, కలిదిండి, నూజివీడు ఎంపీ యూపీ/జడ్పీ పాఠశాలల్లో ఒక్కొక్క పోస్టు చొప్పున మొత్తం 7 స్కూల్ అసిస్టెంట్ కేడర్ అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలు ఆయా సబ్జెక్టుల్లో జరుగనున్నాయి. ఏలూరు జిల్లా నియామకాలకు సంబంధించి బుధ లేదా గురువారాల్లో నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లాలో తాత్కాలిక పద్ధతిన అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని డీఈవో నారాయణ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో 10 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. భీమవరం మండలంలోని తాడేరు జడ్పీ పాఠశాల, తణుకులోని బాలికల పాఠశాలలో సంస్కృతం పోస్టు, మోగల్లు, వెస్ట్ విప్పర్రు, పరిమెళ్ళ, ఆరుగొల్లు పాఠశాలల్లో హిందీ పోస్టులు, గోటేరు, రాపాక, తణుకు జడ్పీ స్కూల్, ఎల్ఎన్‌పురం పాఠశాలల్లో ఇంగ్లీషు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 5 నెలల కాలానికి నెలకు స్కూల్ అసిస్టెంట్‌కు రూ. 12 వేల 500, సెకండరీ గ్రేడ్ టీచర్‌కు రూ. 10 వేలు వేతనం చెల్లిస్తారని, ఆసక్తిగల వారు ఈ నెల 5వ తేదీలోగా పూర్తిచేసిన దరఖాస్తులను నేరుగా సంబంధిత మండల విద్యాశాఖాధికారికి అందించాల్సి ఉందన్నారు. దరఖాస్తు ఫారాలు ఎంఈవో కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు.

'నవోదయ' టీచర్ పోస్టులు భర్తీ చేయండి : ఎంపీ

ఏలూరు టూటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయాల్లో టీచర్ల పోస్టులు భర్తీ చేయాలని పార్లమెంట్‌లో ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ కేంద్రాన్ని అభ్యర్థించారు. 171 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. గత ఐదేళ్లలో దేశంలో 28 నవోదయ విద్యాలయాలు కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. ఏపీలోని 13 జిల్లాల్లో విద్యాలయాలు ఉన్నాయని మిగిలిన జిల్లాల్లో కూడా ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన కేంద్రమంత్రి జయంత్ చౌదరి త్వరలోనే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని, ఏపీలోని అన్ని జిల్లాల్లో విద్యాలయాల ఏర్పాటు చేస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో పాలసేకరణ, పాలధరలపై ఎంపీ ప్రశ్నించగా స్థానిక సహకార, ప్రయివేటు డైరీల సంస్థలే అక్కడ మార్కెట్ స్థితిగతులను బట్టి ధరలు నిర్ణయిస్తాయన్నారు.

దూర విద్య అడ్మిషన్లకు తుది గడువు ఈ నెల 6

ఏలూరు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (అపోస్) దూరవిద్య పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు తత్కాల్ విధానంలో అడ్మిషన్ ఫీజును రూ.600లు ఆలస్య రుసుంతో కలిపి చెల్లించేందుకు తుది గడువును ఈ నెల 6 వరకు పొడిగించినట్టు డీఈవో వెంకట లక్ష్మమ్మ, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఆశ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రెగ్యులర్ విధానంలో పదో తరగతి పరీక్షలు పాత సిలబస్‌తో రాసి ఫెయిలైన అభ్యాసకులు తాజాగా దూరవిద్యలో అడ్మిషన్ పొందేందుకు వెసులుబాటు కల్పించామని, ఈ విద్యార్థులు అడ్మిషన్ ఫీజుతోపాటే పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఏఐ కో-ఆర్డినేటర్లు అడ్మిషన్లకు కృషి చేయాలని కోరారు.

పరిశ్రమల కేంద్రం జీఎంగా వెంకట్రావు



ఏలూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్‌గా ఆర్. వెంకట్రావు బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా జీఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు గత నెల 30న పదవీ విరమణ చేశారు. దీంతో కృష్ణా జిల్లా జీఎంగా పనిచేస్తున్న వెంకట్రావుకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. వెంకట్రావు 2003లో ఉమ్మడి పశ్చిమలో డీఆర్‌డీఏ ఏపీడీగా పనిచేయగా, 2012లో జిల్లా పరిశ్రమల కేంద్రంలో డిప్యూటీ డైరెక్టర్‌గాను, ఏలూరు జిల్లాలో జీఎంగా 2021లో పనిచేసిన అనుభవం ఉంది.

'దర్గాగా కబ్జా'పై సర్వత్రా చర్చ

కబ్జా భూములను పరిశీలించిన అధికారులు

తక్షణ చర్యలుంటాయన్న ఆర్డీవో రమణ



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

జంగారెడ్డిగూడెం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'దర్గాగా కబ్జా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనం సంచలనం సృష్టించింది. ఈ ప్రాంతంలో కబ్జా విషయం చర్చనీయాంశమైంది. తక్కువ ధరకే భూమి వస్తుంది. అందులో బ్యారన్‌లు నిర్మించు కోవచ్చు అనుకున్న వారి ఆశలు అడియాశలయ్యాయి. కొంత మంది బడా బాబుల మాయమాటలను నమ్మి మోసపోయిన బాధితులు ఏం చేయాలో.. ఎవరికి చెప్పాలో తెలియక సతమతమవుతున్నారు. దాదాపు 3 ఎకరాల వరకు విక్రయించినట్టు తాజాగా పుకార్లు వినిపిస్తున్నాయి. ఇది ప్రభుత్వ భూమి, ఎప్పటికైనా అధికారులు వస్తారు.. స్వాధీనం చేసుకుం టారు అని తెలియక చాలామంది సదరు భూమిని కొనుగోలు చేసినట్టు చెప్పుకుంటున్నారు.

విచారణ జరిపి చర్యలు : ఆర్డీవో



ఈ విషయంపై ఆర్డీవో ఎంవీ రమణ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. అక్రమాలను సహించమని, ఆక్రమణలకు గురైన భూములు, అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే జంగారెడ్డిగూడెం తహసీ ల్దార్ స్లీవజోజి మంగళవారం ఉదయం మైసన్నగూడెం వెళ్లి సదరు భూములను, అక్రమ కట్టడాలను పరిశీ లించారు. సర్వేయర్ల ద్వారా అక్రమ నిర్మా ణాల కొలతలను సేకరించారు. సంబంధిత రైతులతో మాట్లాడి ఆ కట్టడాలని తొలగించాలని ఆదేశించినట్టు సమాచారం.

సిబ్బంది మెడకు చుట్టుకోనున్న వ్యవహారం..

మైసన్నగూడెం ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాల వ్యవహారం కొత్తగా వచ్చిన సిబ్బంది మెడకు చుట్టుకోనుంది. ఆంధ్రజ్యోతి కథనంపై తహసీల్దార్ మంగళవారం గ్రామంలోకి వెళ్లి గ్రామ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. వాస్తవానికి ఈ వ్యవహారం ఇంతక ముందే జరిగిందని వీఆర్వో, సెక్రటరీలకు సంబంధం లేదని చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం మైసన్నగూడెం పంచాయతీ కార్యదర్శిగా ఉన్న నాగబాబు ఇన్‌చార్జ్‌గా ఇక్కడ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈయన ఆరు నెలల క్రితం జంగారెడ్డిగూడెం మండలం అమ్మపాలెం సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించగా రెండు నెలల క్రితం మైసన్నగూడెం ఇన్‌చార్జి సెక్రటరీగా బాధ్యతలు అప్పగించారు. అలాగే మైసన్నగూడెం వీఆర్వో సురేష్ కూడా ఆరు నెలల క్రితమే వచ్చారు. సదరు భూమిలో ఏడాది క్రితం నుంచే అక్రమ కట్టడా లు జరిగాయని ఇప్పుడు కొత్తగా జరుగుతున్న నిర్మాణాలు వెలుగులోకి రావడం వాస్తవం. దీంతో సెక్రటరీ, వీఆర్వోలను బలిపశువులుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గ్రామాల మధ్య చిచ్చు పెడితే సహించను

అటవీ భూములు ఆక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు : మంత్రి సారథి

అటవీ రెవెన్యూ సరిహద్దులను విభజించాలని అధికారులకు ఆదేశం



అటవీ రెవెన్యూ భూ సరిహద్దులను పరిశీలిస్తున్న మంత్రి సారథి, సబ్ కలెక్టర్ వినూత్న, డీఎఫ్‌ఓలు

నూజివీడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం జంగంగూడెం, దేవరగుంట గ్రామాల మధ్య భూముల సరిహద్దు విషయంలో వివాదం చెలరేగి రైతులు పరస్పరం దాడులు చేసుకున్న విషయం విదితమే.. ఈ నేపథ్యంలో మంగళవారం రెవెన్యూ, పోలీస్, అటవీ శాఖ అధికారు ఇరు గ్రామాల ప్రజలతో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సమావేశమయ్యారు. మంత్రి స్వయంగా రెండు కిలో మీటర్ల అటవీ ప్రాంతంలో మోటార్ సైకిల్‌పై వెళ్ళి నాలుగు గంటల పాటు అధికారులతో కలిసి భూములు పరిశీలించి ఫారెస్ట్ డీఎఫ్‌ఓ సబ్ కలెక్టర్‌కు పలు సూచనలు చేశారు. దేవరకొండ గ్రామ పరిధిలోని అటవీ భూములు ఆక్రమించకుండా సరిహద్దులు నిర్ణయించాలని ఆదేశించారు. దేవరగుంట గ్రామానికి చెందిన రైతులకు సంబంధించిన భూములను సబ్ డివిజన్ చేసి ఫారెస్ట్ సరిహద్దులను నిర్ణయించాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా భూమి వివాదాలు సృష్టించినా, ఆక్రమించే ప్రయత్నం చేసినా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిరుపేదలు అటవీ బంజరు భూములను సాగు చేసుకోవడంలో అభ్యంతరం లేదని అయితే సామరస్యంగా ఇరు గ్రామాల వారు చర్చించుకుని ఒక నిర్ణయానికి వచ్చి అటవీ బంజరును సాగు చేసుకుంటే బాగుండేదన్నారు. అలా కాకుండా ఘర్షణలు పడి పరిస్థితి సంక్లిష్టంగా మార్చారన్నారు. నిబంధనల ప్రకారం అటవీ భూములు సాగు చేయకూడదన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించినప్పుడు ప్రస్తుతం సాగులో ఉన్న భూముల్లో బోర్లను కోసి వేయడాన్ని బట్టి చూస్తే వివాదాన్ని కావాలని ఎవరో వెనకుండి సృష్టిస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఎవరైనా కావాలని పేదలను ఇబ్బంది పెడితే ఉపేక్షించనని మంత్రి అన్నారు. దేవరకుంట గ్రామం సర్వే నెంబర్ 1లో రెండు మూడు దఫాలుగా సుమారు 70 నుంచి 80 పట్టాలు ఇవ్వడం జరిగిందని,కానీ కొంత మంది రైతులు మాత్రమే సాగు చేసుకుంటున్నారని అన్నారు.. ఎక్కువ మంది ఆ భూమిని అప్పజెప్పక సబ్ డివిజన్ చేయక ఈ గందరగోళానికి దారితీసిందన్నారు. కేవలం బలమున్న వాళ్ళు కొమ్ముకాసి కొంత మందిని రెచ్చగొట్టి మొక్కలు వేయించడం, మరొకరు పీకించడం ఇటువంటి చర్యలకు పాల్పడుతూ రాజకీయం చేస్తున్నారని అన్నారు. ఎంత మందికి పట్టాలిచ్చారో సబ్ డివిజన్ చేసి పరిశీలించాలన్నారు. వివాదానికి కేంద్ర బిందువుగా నిలిచిన జంగంగూడెం గ్రామంలోని రీసర్వే నెంబర్ 22లో ఉన్న ఫారెస్టు భూమిలో బోర్డు పెట్టాలన్నారు. ఎవరు ఆక్రమణలకు పాల్పడినా చర్యలు తీసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న, డిఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, తహసీల్దార్ బద్రు, ఎంపీడీవో చెన్న రాఘవేంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

పెదవేగి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విశాఖలో జరిగే సీఐటీయూ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్వీడీ.ప్రసాద్ పిలుపునిచ్చారు. పెదవేగి మండలం లక్ష్మీపురంలోని దెందులూరు మార్కెట్ యార్డు దగ్గర మంగళవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో మహాసభలకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖలో సీఐటీయూ 18వ మహాసభలు జరుగుతాయని, ఈ మహా సభలను జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మహా సభల్లో కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించడంతో పాటు పలు తీర్మానాలను ఆమోదిస్తారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.సుబ్బారావు, పి.రమేశ్, కనకారావు, దుర్గారావు పాల్గొన్నారు.

ఇద్దరు రేషన్ డీలర్లపై కేసు నమోదు

రూ.8,41,541 విలువ గల బియ్యం, పంచదార సీజ్



దేవులపల్లి రేషన్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్,రెవెన్యూ అధికారులు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం రేషన్ దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. మండలంలోని దేవులపల్లి గ్రామానికి చెందిన రేషన్‌దుకాణం నెంబర్-14, జంగారెడ్డిగూడెం పట్టణంలోని రేషన్‌దుకాణం నెంబర్-35లో స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో రెండు రేషన్ దుకాణాలలో బియ్యం, పంచదారలలో వ్యత్యాసాలు గుర్తించారు. ప్రస్తుతం రెండు దుకాణాలలో ఉన్న భౌతిక నిల్వలు రూ.8,41,541 విలువ గల బియ్యం, పంచదారను సీజ్ చేశారు. రేషన్ డీలర్లపై నిత్యావసర వస్తువుల చట్టం 1955 సెక్షన్ 6(ఎ) ప్రకారం కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ తహసీల్దార్ బి.కన్యాకుమారి తెలిపారు. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ రీజనల్ అధికారి కె.నాగేశ్వరరావు ఆదేశాలతో ఈ దాడులు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎస్సై కె.సీతారాము, స్థానిక సీఎస్‌డీటీ వెంకటేశ్వరరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఏలూరులో స్టేడియాల రూపురేఖల్ని మార్చండి

శాప్ చైర్మన్ రవినాయుడు ఆదేశం



ఇండోర్ స్టేడియంలో పైకప్పు పరిశీలిస్తున్న రవి నాయుడు

ఏలూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): 'జిల్లా కేంద్రమైన ఏలూరు స్టేడియాల్లోని రూపురేఖల్ని మూడు నెల్లలో మార్చి.. సుందరంగా తీర్చిదిద్దేందుకు తగు చర్యలు తీసుకోండి.. వాకర్స్‌కు ఇందులో ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి' అని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు క్రీడాధికారులను ఆదేశించారు. రవినాయుడు పెద్ద రైల్వేస్టేషన్ వద్ద అల్లూరి సీతారామరాజు స్టేడియాన్ని తొలుత పరిశీలించి.. అక్కడ వాకర్స్ క్రీడాకారులతో సౌకర్యాలపై ఆరా తీశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో క్రీడా వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. స్టేడియంలో టెన్నిస్, ఫుట్‌బాల్, హాకీ, అథ్లెటిక్స్, స్విమ్మింగ్‌పూల్, బాస్కెట్‌బాల్ ఆడే క్రీడాకారులకు సౌకర్యాలను కల్పించాలని, వారు ప్రాక్టీస్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా వాకర్స్‌కు ఏర్పాట్లు ఉండాలని సూచించారు. అథ్లెటిక్స్‌కు అనుగుణంగా సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. ఇండోర్ స్టేడియంలో ఆయన పరిశీలించి.. పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని, మైదానం పూర్తిగా చదును చేయాలని ఆదేశించారు. ఇక్కడ ఇటీవల కూల్చివేసిన స్థానంలో మల్టీపర్పస్ స్టేడియం అభివృద్ధికి అంచనాలు వేయాలని ఇంజనీర్లకు ఆయన సూచించగా, వారు కొలతలు తీసుకున్నారు. స్విమ్మింగ్ పూల్‌లో లైటింగ్, టాయిలెట్లు మరమత్తులు, జిమ్ రూమ్‌లో విద్యుత్ సౌకర్యాలను మెరుగుపర్చడం కోసం శాప్ ఇంజనీర్లు అనిల్, ప్రశాంత్‌లు అంచనాలు వేశారు. రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ బడేటి వెంకట్రామయ్య మాట్లాడుతూ స్టేడియాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలకు ఎమ్మెల్యే చంటి సహకారంతో అన్ని చర్యలు చేపడతామన్నారు. శాప్ చైర్మన్ వెంట డైరెక్టర్లు జగదీశ్వరీ, ఎస్.సంతోష్‌కుమార్, పేరం రవీంద్రనాథ్, డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఎనిమిదవ తరగతి చదువుతున్న వాడవలస దివ్య రగ్బీ పోటీలలో అండర్-14 విభాగంలో జాతీయ స్థాయికి ఎంపిక కాగా, తొమ్మిదో తరగతి చదువుతున్న కంచర్ల రామ చైతన్య జూనియర్స్ వాలీబాల్ విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం పట్నాల సోమశేఖర్ అధ్యక్షతన మంగళవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి దివ్య, రామచైతన్యలను అభినందించారు.

కూలీ అనుమానాస్పద మృతి

పాలకోడేరు, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): గరగపర్రు గ్రామంలో చేపలు, రొయ్యల చెరువుల్లో మట్టిని తొలగిస్తూ మంగళవారం మధ్యాహ్నం రేలంగి గ్రామానికి చెందిన వీరవల్లి దానయ్య (44) మృతి చెందినట్లు పాలకోడేరు పోలీసులు తెలిపారు. దానయ్య అదే గ్రామానికి చెందిన మరికొంత మంది వ్యక్తులతో కలిసి గరగపర్రు గ్రామంలోని తమ్మిశెట్టి బాలాజీకి చెందిన చెరువులో మట్టి తీసే పనికి వెళ్ళారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో ప్రమాదవశాత్తు బురదలో పడిపోయినట్లుగా పక్కవారు గమనించి ఒడ్డుకు తీసుకువచ్చి భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధృవీకరించారు. అయితే భార్య శ్రీదేవి తన భర్త దానయ్య విద్యుత్ షాక్ వల్ల లేదా మరే ఇతర కారణం వల్ల గాని చనిపోయి ఉంటారంటూ పాలకోడేరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆరుగొలను సొసైటీ అవినీతిపై విచారణ

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆరుగొలను సొసైటీలో అవినీతి జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి విచారణకు ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి చైర్మన్, కార్యదర్శి కలిసి బారీగా రైతులకు అందించాల్సిన సొమ్ములు స్వాహా చేశారని ఆరోపణలు రావడంతో ఆ ఆరోపణలపై 52 ఎంక్వరి విధించారు. కళ్యాణ మండప నిర్మాణం, హమాలి చార్జీల చెల్లింపులు, మెడికల్ క్యాంపుల నిర్వహణలో అవినీతిపై నిగ్గు తేల్చేందుకు విచారించనున్నారు.

భార్య, ఇద్దరు పిల్లల అదృశ్యం

టి.నరసాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. గంగిరెడ్ల అప్పలరాజు 8 సంవత్సరాల నుంచి టి.నరసాపురం మండలం బొర్రంపాలెంలో భార్య ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. అప్పలరాజు భవాని మాల వేసుకుని నవంబరు 27న అదే వీధిలో ఉన్న పీఠం వద్దకు వెళ్లాడు. పూజ ముగించుకుని రాత్రి 10 గంటలకు ఇంటికి వచ్చేసరికే భార్య పిల్లలు కనిపించలేదు. అదే గ్రామానికి చెందిన శానంపూడి కుమార్‌పై అనుమానం ఉన్నట్లు అప్పలరాజు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

కత్తులతో స్వైరవిహారం.. ఇద్దరి అరెస్టు



ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన వన్‌టౌన్ పోలీసులు

భీమవరం క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత నెల 26వ తేదీన సాయంత్రం 5 గంటల సమయంలో కత్తులతో విద్యార్థులపై దాడికి యత్నించిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు మంగళవారం తెలిపారు. చినరంగనిపాలెం సెంటర్‌లో బెంగళూరు అయ్యంగారి బేకరీ ఎదు రుగా రోడ్డుపై కొందరు విద్యార్థులు బస్సు ఎక్కడానికి గత నెల 26వ తేదీన నిలబడి ఉన్నారు. అయితే అదే సమయంలో అక్కడికి రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చిన నలుగురు వ్యకులలో ఇద్దరు వ్యక్తులు వారి వద్ద ఉన్న కత్తులతో అక్కడ బస్సు ఎక్కడానికి నిలబడి ఉన్న విద్యార్థులను బెదిరించారు. దౌర్జన్యంగా వారి వద్ద ఉన్న డబ్బులు ఇవ్వమని, లేదంటే చంపేస్తామని బెదిరించి హల్‌చల్ చేయడంతో ఆ విద్యార్థులు ప్రాణభయంతో అక్కడి నుంచి పారిపోయారు. తర్వాత ఆ నలుగురు బేకరీ చుట్టుపక్కల కత్తులతో స్వైరవిహారం చేసి చుట్టుపక్కల ఉన్నవారిని, విద్యార్థులను కత్తులతో భయభ్రాంతులకు గురిచేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన వన్‌టౌన్ పోలీసులు చినరంగనిపాలెం పుంత ఏరియాకు చెందిన కోలా ఆనంద్, కోలా ప్రకాష్‌లను ఈ నెల 1వ తేదీన అరెస్ట్ చేసి మంగళవారం కోర్టులో హాజరుపరచగా కోర్టు వారికి 14 రోజులు రిమాండ్ విధించిందన్నారు. మిగిలిన ఇద్దరు వ్యక్తులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

పూళ్లలో పట్టపగలు దారుణ హత్య



నాగరాజు(ఫైల్)

భీమడోలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం, పాత గొడవల నేపథ్యంలో ఒక వ్యక్తిపై నలుగురు దాడిచేసి హత్య చేసిన ఘటన భీమడోలు మండలం పూళ్ళ గ్రామంలో జరిగింది. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పూళ్ళ పాత దళితపేటకు చెందిన పాత నాగరాజు (40)తో కాంద్రు నాగతేజ, కాంద్రు ఇస్సాక్, అద్దంకి బాబి, కాలి రాజేష్‌లకు కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం పూళ్ళ సంతమార్కెట్ వైపు వెళుతుండగా నలుగురు వ్యక్తులు వెనుక నుంచి దాడి చేసి కత్తితో తలపై గాయపరిచారు. నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన అనంతరం నలుగురు వ్యక్తులు పరారైనట్లు పోలీసులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న భీమడోలు సీఐ విల్సన్, ఎస్ఐ మదీనా బాషా ఘటనా ప్రదేశానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఘటనా ప్రదేశానికి డాగ్, క్లూస్ టీంలు చేరుకుని ఆధారాలు సేకరించాయి. మృతుడు భార్య పాత మాధవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విల్సన్ తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టమ్‌కి తరలించారు. హత్యా ఘటనలో పూళ్ళ గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. పట్టపగలు హత్య ఘటనను చూసిన ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడి మృతి



వెంకటేశ్వరరావు మృతదేహం

జంగారెడ్డిగూడెం రూరల్, డిసెంబరు 2, (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి ఒక మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడువాయి గ్రామానికి చెందిన మత్స్యకారుడు నరిగిరి వెంకటేశ్వరరావు (62) ప్రతి రోజు ఎర్రకాలువ జలాశయంలోకి వెళ్లి చేపల వేట ద్వారా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇదే క్రమంలో మంగళవారం తెల్లవారు ఝామున పడవపై చేపల వలలతో వేటకు వెళ్లాడు. అయితే మధ్యాహ్నం 12 గంటలు అయినా తన భర్త వెంకటేశ్వరరావు ఇంటికి రాకపోవడంతో భార్య గంగారత్నం ఎర్రకాలువ ఒడ్డుకు వెళ్లి చూసేసరికి నీళ్లల్లో తేలాడుతున్న పడవ మాత్రమే కనిపించింది. దీంతో ఈ విషయాన్ని స్థానిక మత్స్యకారులు తెలపడంతో వారంతా పడవలపై జలాశయంలో గాలించగా వెంకటేశ్వరరావు మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉంది. జంగారెడ్డిగూడెం ఎస్ఐ వీరప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి ఆర్టీసీ డ్రైవర్ మృతి



దుర్గారావు మృతదేహం

పాలకోడేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్ ఆదిరెడ్డి దుర్గారావు (43) అనుమానాస్పద స్థితిలో సోమవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్టు పాలకోడేరు పోలీసులు తెలిపారు. వీరవాసరం గ్రామానికి చెందిన ఆదిరెడ్డి దుర్గారావు కుటుంబం మోగల్లు గ్రామంలోని అత్తవారి ఇంటి వద్ద గత కొన్ని సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారు. దుర్గారావు మోగల్లు గ్రామంలోనే ఉంటూ ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే కొన్ని రోజులుగా ఏమైందో ఏమో తెలియదుగాని ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలోనే గత నెల 30వ తేదీ తెల్లవారు జామున పురుగుల మందు తాగేశాడు. దీంతో కుటుంబ సభ్యులు దుర్గారావును వేంద్ర హాస్పిటల్‌కు, మెరుగైన వైద్యం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడని భార్య రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

బిల్డింగ్ పైనుంచి పడి మహిళ మృతి



రాధ మృత దేహం

పాలకొల్లు టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టిడ్కో గృహాల కాలనీలో మంగళవారం తెల్లవారుజామున ఒక మహిళ అనుమానాస్పద స్థితిలో మరణించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడి రాధ (30) ఏడేళ్ళుగా సుధాకర్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఈనేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున వారి ఇరువురి మధ్య గొడవ జరిగి, రాధ మరణించిందని సమాచారం. టిడ్కో గృహాల కాలనీలో సిబ్లాక్ 65 నెంబర్ ప్లాట్‌లో (4వ అంతస్థు) పైనుంచి రాధ కిందపడిపోయి ందని స్థానికులు చెబుతున్నారు. తాడి రాధ తన భర్త నుంచి విడిపోయి సుమారు 10ఏళ్ళు అవుతోందని, సుమారు 7ఏళ్ళుగా సుధాకర్‌తో సహజీవనం చేస్తున్నట్టు సమాచారం. మృతురాలు రాధకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఎస్పీ నయీం ఆస్మి, నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ పృథ్వీ కేసు నమోదు చేశారు. రాధతో సహజీవనం చేస్తున్న సుధాకర్ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

లాడ్జిలో ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

భీమవరం క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): టౌన్‌హాల్‌లో ఉన్న లాడ్జిలో ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ ఎస్ఐ బీవై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం భీమవరం ఒకటవ పట్టణానికి చెందిన అడపా శివ(38) ప్రస్తుతం పాలకోడేరు మండలం గొల్లలకోడేరు ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే రొయ్యల వ్యాపారంలో బాగా నష్టాలు రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం టౌన్ హాల్‌లో లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. మంగళవారం ఉదయం నుంచి బయటకు రాకపోవడంతో లాడ్జి నిర్వాహకులు పరిశీలించగా ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కలుపు నివారణ మందు నీళ్లు తాగిన వ్యక్తి మృతి

పెదవేగి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కలుపు నివారణ మందు కలిపిన నీళ్లు తాగి వ్యక్తి మృతిచెందాడు. పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. జగన్నాథపురం గ్రామానికి చెందిన మేడికొండ పవన్‌కుమార్ గతనెల 21వ తేదీన పొలంలో కలుపు నివారణ మందును పిచికారీ చేస్తూ మధ్యలో దాహం వేస్తుందని మంచినీరు అనుకుని గట్టుమీద కుండలో ఉన్న కలుపు నివారణ మందు కలిపిన నీటిని తాగేశాడు. నీళ్ల తాగిన తరువాత అవి మందు నీరని గ్రహించి, అతని సోదరుడు చెప్పగా వెంటనే గుడివాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. అక్కడ అతని పరిస్థితి విషమించడంతో సోమవారం సాయంత్రం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకొస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. దీనిపై కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బైక్ ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న వ్యక్తి మృతి

నరసాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని థామస్ వంతెన వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు మొగల్తూరు మండలం కాళీపట్నంకు చెందిన ఎస్ గోపాలకృష్ణ (55)గా గుర్తించారు. రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడ్ని అటుగా వెళుతున్న రూరల్ ఎస్సై సురేష్ గమనించి పోలీస్ వాహనాన్ని ఆపారు. కొనఊపిరిలో ఉన్న గోపాలకృష్ణకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి జీపులో తీసుకెళ్లి చికిత్స అందించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

పెదపాడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు పరీక్షల వల్ల ఎదురయ్యే ఆందోళన, ఒత్తిడి సమస్యలను ఎదుర్కొనేందుకు దృఢమైన మానసిక ఆరోగ్యం కలిగి ఉండాలని నోడల్ ఆఫీసర్ డాక్టరు కోమలి తెలిపారు. వట్లూరు గురుకుల పాఠశాలలో జాతీయ మానసిక సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. డాక్టరు కోమలి మాట్లాడుతూ ఒత్తిడి సమయలో చేయాల్సిన యోగాపై అవగాహన కల్పించారు. మానసిక ఇబ్బందులుంటే 14416 టెలీమానస్ హెల్ప్‌లైన్‌ని సంప్రదించాలన్నారు. ప్రిన్సిపాల్ డి.మేరీరూన్సీ ఉన్నారు.

ఉచిత కార్ డ్రైవింగ్ శిక్షణ

పెదపాడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (వట్లూరు) ఆధ్వర్యంలో ఉచితంగా కార్ డ్రైవింగ్ శిక్షణ నిర్వహిస్తున్నట్టు సంస్థ తెలిపింది. స్త్రీ, పురుషులకు ఈ నెల 11వ తేదీ నుంచి 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, 19 నుంచి 50 సంవత్సరాల వయస్సు, 10వ తరగతి ఆపై అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. శిక్షణా కాలంలో ఉచితంగా శిక్షణతో పాటుగా భోజనం, వసతి ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు సంస్థ కార్యాలయంలో, 99485 65256, 90140 40780 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నిర్వాసితుల ఇళ్ల నిర్మాణానికి ఇసుక నిలిపివేత

నాసిరకం ఇసుక సరఫరా చేస్తున్నారంటూ స్థానికుల ఫిర్యాదు

కుక్కునూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల కోసం కివ్వాకలోని పునరావాస కాలనీకి ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. అయితే కాలనీకి ఇసుక రవాణా చేయడానికి అనుమతులు లేవనే ఆరోపణలతో పాటు నాసిరకం ఇసుక రవాణా చేస్తున్నారనే విమర్శలు వచ్చాయి. ఇసుక రవాణాపై తహసీల్దార్ రమేశ్‌బాబుకి ఫిర్యాదు వెళ్లడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇసుక రవాణా ఆపివేశారు. సోమవారం ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ రమేశ్‌బాబుకి స్థానికులు ఫిర్యాదు చేశారు. గుండేటివాగు నుంచి ఇసుక సరఫరా చేయడానికి ఎటువంటి అనుమతులు లేవని అలాగే నాసిరకం ఇసుక రవాణా జరుగుతున్నట్లు గుర్తించి నిలిపివేసినట్లు తహసీల్దార్ తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో పరిశీలన చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

తడికలపూడి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఏఎస్పీ

కామవరపుకోట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ఏఎస్పీ రామనాథన్ సుస్మిత మంగళవారం కామవరపుకోట మండలంలోని తడికలపూడి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలిచ్చారు. కేసుల ప్రగతి తీరును తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఏఎస్పీ సుస్మిత మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితుల నుంచి సక్రమంగా సరైన వివరణ తీసుకుని కేసులు నమోదు చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రికార్డులు పూర్తి చేసే విధంలో తగు సలహాలు, సూచనలిచ్చారు. ఏఎస్పీ వెంట తడికలపూడి ఎస్ఐ పి.చెన్నారావు, సిబ్బంది అజయ్, సుధీర్ ఉన్నారు.

పెట్రోల్ బంకుల్లో ఉత్తమ సేవలకు బహుమతులు

ఏలూరు క్రైం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో పోలీసు అధికారుల సంఘ ఆధ్వర్యంలో నడుస్తున్న కైకలూరు, ఏలూరు నగరంలోని మొత్తం మూడు పెట్రోల్ బంకుల్లో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి ఎస్పీ కెపిఎస్ కిషోర్ నగదు ప్రోత్సాహక బహుమతులను అందించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో పెట్రోల్ బంక్ సిబ్బందికి మంగళవారం బహుమతులు అందించారు. ఈసందర్భంగా ఎస్పీ కిషోర్ మాట్లాడుతూ పెట్రోల్ బంకుల్లో పనిచేసే సిబ్బంది విధి నిర్వహణలో ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. కష్టపడి ఉత్తమ సేవలు అందించే సిబ్బందికి ఎప్పుడు గుర్తింపు ఉంటుందని వారి కష్టాన్ని గుర్తించి వారిని ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సతీష్, ఏఆర్ఎస్ఐ రవీంద్ర, పెట్రోల్ బంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో కొండయ్య చౌదరికి చింతమనేని పరామర్శ

దెందులూరు, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): దెందులూరు సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు గారపాటి కొండయ్య చౌదరి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఏలూరు ఆయూష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చౌదరిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఆయన వెంట జోగన్నపాలెం సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు డాక్టర్ పసుమర్తి మధుబాబు, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఇప్పిలి వెంకటేశ్వరరావు, బొప్పన సుధాకర్ టీడీపీ నేతలు ఉన్నారు.

ఎమ్మెల్యే రోషన్‌కు కిడ్నీ వ్యాధిగ్రస్థుడి కృతజ్ఞతలు



జంగారెడ్డిగూడెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆదేశాలతో కిడ్నీ వ్యాధి గ్రస్తుడికి నెల రోజుల్లో పింఛన్ మంజూరైందని పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ తెలిపారు. పట్టణంలోని 19వ వార్డులోని ఉప్పలమెట్ట ప్రాంతానికి చెందిన కిడ్నీ వ్యాధి గ్రస్తుడు చలమచర్ల బాబీకి నూతనంగా మంజూరైన పింఛన్ రూ.20 వేలను మంగళవారం పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ చేతుల మీదుగా అందజేశారు. కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ కుటుంబ పోషణ భారంగా మారిందని బాధితుడు బాబీ టీడీపీ పట్టణ అధ్యక్షుడు కిషోర్‌కు తెలిపారు. దీంతో డిసెంబరు నెలకు సంబంధించి రూ.20 వేలు పింఛన్ మంజూరైంది. బాధిత కుటుంబం ఎమ్మెల్యే రోషన్ కుమార్‌కు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్‌కు కృతజ్ఞతలు తెలి పారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు,టీడీపీ నాయ కులు కంపా రాజేంద్ర, వెంపా రాజు, కోనేటి చంటి,షేక్ రషీద్ పాల్గొన్నారు.

మేడల్లో కొలువైన అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు



ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తూర్పువీధిలో జరుగుతున్న గంగానమ్మ, ఆదిమహాలక్ష్మమ్మ, పోతురాజుబాబుల జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మేడల్లో కొలువై ఉన్న అమ్మవార్లను మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని పసుపు కుంకుమలతో అర్చనలు జరిపి నివేదనలు సమర్పించి ఆరాధించారు. పలువురు ప్రతినిధులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ మేరకు జాతర సందడి నెలకొంది.

ర్యాగింగ్ భూతానికి వైద్యమేది ?

(3వ పేజీ తరువాయి)

పర్యాయాలు శంకుస్థాపనలు జరిగాయి. రూ.550 కోట్లతో ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో పనులు చేపట్టారు. 2023 ఏప్రిల్ 26న ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 150 ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం సీట్లకు నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతి ఇచ్చింది. 2023 సెప్టెంబరు 1 నుంచి ఫస్ట్ ఇయర్ తరగతులు మొదలయ్యాయి. 12 మంది మినహా మిగిలిన వారంతా హాస్టలర్సే. 2024 సెప్టెంబరులో రెండో బ్యాచ్, 2025 అక్టోబరులో మూడో బ్యాచ్ విద్యార్థులు చేరారు. మొట్ట మొదటిగా చేరిన విద్యార్థులు రెండవ బ్యాచ్ వారిని ర్యాగింగ్ పేరుతో ఇబ్బందులకు గురి చేయడంతో విషయం అధికారులకు వెళ్లడంతో వారు తీవ్రంగా హెచ్చరించారు. థర్డ్, సెకండియర్ విద్యార్థుల మధ్య వైర్యం మరింత ఎక్కువైంది. ఇటీవల సీనియర్ల వేధింపులకు ఒక జూనియర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కొందరు ప్రొఫెసర్ల ఒత్తిడి తో ఆ విద్యార్థిని రహస్యంగా వైద్యం చేయించి, అతని వాంగ్మూలం కుటుంబ సమస్యగా మార్చారని ఆరోపిస్తున్నారు.

వారి భవిష్యత్ కాపాడేందుకు..

విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ఒక పక్క పోలీసు లు, మరోపక్క అధ్యాపకులు శాయశక్తులా కృషి చేస్తూ వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో వర్గ విబేధాలు తలె త్తినా ర్యాగింగ్ జరిగినా ఉపేక్షించేంది లేదని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయితే జూనియర్ విద్యార్థులు ఆరోపిస్తున్న ర్యాగింగ్ అంశం ఎంత వరకూ వాస్తవం? సీనియర్ విద్యార్థులు ఆరోపిస్తున్నట్టు జూనియర్లు చేస్తున్న దాడుల్లో నిజమెంత? అనే కోణంలో పోలీసులు దర్యాప్తును చేస్తున్నారు. ర్యాగింగ్‌ను నియంత్రిచడానికి హాస్టల్‌లో ఒక కమిటీ, కాలేజీలో మరో కమిటీ ఉంది. ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో మరో కమిటీ ఉంది. కాని ఇంత కాలం విద్యార్థులు ఏ కమిటీకి చెప్పకుండా అకస్మాత్తుగా దాడులకు తెగబడడంతోనే అందరూ అవాక్కయ్యారు.

విద్యార్థులకు రక్షణ ఏది

ఎంతో కష్టపడి చదివి ర్యాంకులను సాధించి మెరిట్ విద్యార్థులుగా రాణించి ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ ఉచిత సీట్లను పొందారు. మరికొందరు వివిధ కేటగిరిల్లో పేమెంట్ సీట్లు పొందారు. వారంతా వేర్వేరు రాష్ట్రాలు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారే. తమ కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ ఎంబీబీఎస్‌ను అభ్యసించి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి అహర్నిశలు కష్టపడుతు న్నారు. మొదటి సంవత్సరమే చేరిన విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో ఎనాటమి విభాగంలో మొదటి ర్యాంకు, వివిధ ర్యాంకులను సాధించారు. మెడికల్ కళాశాలకు ఆ విద్యార్థులు మొదటి సంవత్సరమే కీర్తి కిరీటాలను తీసుకువచ్చారు. హాస్టల్‌లో వార్డెన్, అసిస్టెంట్ వార్డెన్లుగా సీనియర్ ప్రొఫెసర్లను నియమించాలి. ఇక్కడ నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా నియమించడంతో క్రమశిక్షణ తప్పింది. కేర్ టేకర్లను నియమించడానికి నోటిఫికేషన్ జారీ చేయాల్సి వున్నా అలాంటిది ఏమి లేకుండా ఒక ప్రొఫెసర్ కనుసన్నల్లోనే వీటిని భర్తీచేశారు. దీంతో అక్కడ విద్యార్థుల మంచి చెడ్డలను చూసేందుకు సరైన వారు లేరు. ఎంతో మంది ప్రాణాలు కాపాడడానికి వైద్య విద్యను అభ్యసిస్తున్న వారికి మెరుగైన సదుపాయాలు, సౌకర్యాలు చక్కని వాతావరణం ఏర్పాటు చేస్తే మెరుగైన ఫలితాలు సాధిస్తారు. అధికారులు మెడికల్ కళాశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, విద్యార్థుల మధ్య నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి.

రైతుల గుండెల్లో దిత్వా దిగులు

చిరుజల్లులతో రైతుల్లో ఆందోళన

పంటను కాపాడుకునేందుకు రైతుల పరుగు

బరకాలతో ధాన్యానికి రక్షణ

లింగపాలెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావం రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. సోమవారం చిరు జల్లులు కురవడంతో వరి పంట కోసిన రైతులు తమ ధాన్యాన్ని తడవకుండా ఎలా కాపాడుకోవాలో అర్థంకాక ఆందోళన చెందారు. మండలంలో ఇప్పటి వరకు వరి కోతలు ఇరవై శాతం కూడా దాటలేదు.ధాన్యం అమ్మకాలు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయి. రైతులు కోసిన ధాన్యాన్ని, కోతలకు సిద్ధంగా ఉన్న వరి పంటను ఎలా కాపాడుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ రైతులు ఇబ్బందుల దృష్ట్యా ధాన్యం ఎప్పటికప్పుడు కొనుగోలు చేస్తున్నామన్నారు.

● పోలవరం: తుఫాన్ ప్రభావంతో పోలవరం మండలంలో వాతావరణం రెండ్రోజులుగా రైతులను కలవరపెడుతోంది. మంగళవారం సాయంత్రం తుఫాన్ ప్రభావంతో మండలంలో పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి. వారపు సంత చిరుజల్లుల ప్రభావంతో కొనుగోలుదారులు లేక వెలవెలబోయింది.

● పోలవరం: తుఫాన్ ప్రభావం పట్ల రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు అన్నారు. మంగళవారం తుఫాను ప్రభావంతో మండలంలో ఓ మోస్తరు వర్షం కురుస్తున్న నేపథ్యంలో మండల పరిధిలో ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాల రైతులకు 120 బరకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులందరూ బరకాలను ధాన్యపు రాశులపై కప్పుకుని ధాన్యం పాడవకుండా కాపాడుకోవాలని ధాన్యం అమ్మే సందర్భంలో తీసుకున్న బరకాలను సొసైటీలో అందజేయాలని సూచించారు. పాతపట్టిసీమ సొసైటీ అధ్యక్షులు నునకాని రాంబాబు, సర్పంచ్ సబ్బారపు శ్రీరామ్మూర్తి, ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



జీలుగుమిల్లిలో పొలంలో ఆరబెట్టిన ధాన్యం

● జీలుగుమిల్లి: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. మెట్ట ప్రాంతానికి ఇప్పటి వరకు దిత్వా తుఫాన్ తాకిడి లేకపోయినా రెండు రోజులుగా తుంపర్లతో వర్షం పడటంతో రైతులు వరి కోతలు ముమ్మరం చేశారు. మరోవైపు వచ్చినకాడికి పంట పాడవకుండా ఒబ్బిడి చేసుకుంటున్నారు. రైతులు ధాన్యం అమ్ముకునేందుకు నిబంధనలు అడ్డువస్తున్నాయని వాపోతున్నారు. మరోవైపు ధాన్యం ఆరబెట్టేందుకు సరైన గొడౌన్ సదుపాయం లేక వరి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. దీంతో రైతులు సస్యరక్షణ చర్యలో భాగంగా స్ప్రేయింగ్ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

ఆలయానికి నిధుల మంజూరుపై హర్షం

ఏలూరు రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏలూరులో అతి పురాతనమైన నగరేశ్వరస్వామి ఆలయం పునఃనిర్మాణానికి రెండు కోట్లు మంజూరు చేయించిన ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటికి ఏలూరులోని ఆర్యవైశ్య ప్రముఖులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దివ్వెల జయబాబు, ఎం.టీవీ సత్యకుమార్, తూత శ్రీనివాసరావు, ఊరా రామకృష్ణ మాట్లాడుతూ నగరేశ్వరస్వామి ఆలయంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం ఉందన్నారు. 150 ఏళ్ల చరిత్ర ఉన్న ఆలయం దాతల సహకారంతో పునఃనిర్మాణం చేస్తామని తెలిపారు. పెనుగొండ గ్రామం పేరును వాసవి పెనుగొండగా మార్చడంపై హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోవడం ఆర్యవైశ్య సమాజానికి అపార గౌరవాన్ని చేకూర్చిందని సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



13న భూ సమస్యలపై సీపీఐ సదస్సు

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీపీఐ శత వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 13న స్థానిక వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూ సమస్యలపై రాష్ట్ర సదస్సు జరుగుతుందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల గురవయ్య, బండి వెంకటేశ్వరరావులు తెలిపారు. సీపీఐ కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ కరపత్రాలను బీకేఎంయూ నాయకులు, ఏఐటీయూసీ నాయకులు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సదస్సుకు అన్ని జిల్లాల నుంచి దాదాపు 350 మంది వ్యవసాయ కార్మిక సంఘాల కార్యకర్తలు పాల్గొంటారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, డి.వి.వి.ఎస్.వర్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు జల్లి విల్సన్ తదితర ప్రముఖులు హాజరవుతారన్నారు.గోలిమే బాలయేసు, కూరాకుల బాబూరావు, టి.వి.ఎస్.రాజు, పొట్టేలు పెంటయ్య, బుగ్గల ప్రభాకర్, రెడ్డి శ్రీనివాసడాంగే, పి.కిషోర్, పుప్పాల కన్నబాబు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం

ఏలూరు రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పేర్లభవన్ సెంటర్‌లో ఉన్న ఖాదర్ జెండాలో ఉరుసు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గంధం తయారు చేసి బిందెలతో నింపి పూలమాలలతో అలంకరించి తలపై పెట్టుకుని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం జెండా చెట్టు వద్ద జెండాలను ప్రతిష్ఠించారు. అనంతరం ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ ఖాజీ షేక్ హుస్సేన్, ఖాదర్ జెండా ముజావర్లు, రాజీ షేక్ హుస్సేన్, ఆలీ, సిరాజ్, కరీముల్లా పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులను అభినందిస్తున్న ధర్మరాజు

సమస్యల పరిష్కారానికి కృషి

నిడమర్రు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సమగ్రంగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. ఈ మేరకు చేబ్రోలు, గోపినాధపట్నం, గొల్లగూడెం, నల్లమాడు, గోపాలపురం, రామచంద్రపురం, యర్రమిల్లిపాడు గ్రామాల్లోని సచివాలయాల వద్ద ప్రజా ప్రతినిధులు, గ్రామ కూటమి నేతలు, అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ప్రత్యేంగా చేబ్రోలు రాబోయే రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి ప్రణాళికపై చర్చించారు. ముఖ్యంగా నారాయణపురంలోని సర్వీసు రోడ్డు ఆక్రమణల తొలగించి క్రొత్త రోడ్డు నిర్మించాలన్న ప్రజాప్రతినిధుల అభ్యర్థనను పరిశీలించారు.

పారిశుధ్య కార్మికులకు అభినందన..

ఉంగుటూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నిమిత్తం గత మూడు రోజుల నుంచి అహర్నిశలు శ్రమించిన పారిశుధ్యకార్మికులను ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు హృదయ పూర్వకంగా పేరుపేరున అభినందించారు. సీఎం భద్రతా ఏర్పాట్లు అత్యంత సమర్థవంతంగా నిర్వహించిన పోలీస్ శాఖ ఉన్నతాధికారులకు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

చింతలపూడి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ విభాగంలో బోధన చేయడానికి అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు తెలిపారు. పీజీలో సంబంధిత సబ్జెక్టులో ఓసీ, బీసీలకు 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు ఉన్నవారు అర్హులన్నారు. దరఖాస్తులు ఈ నెల 9వ తేదీలోగా చేసుకోవాలని, 12వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు. పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

ఎయిడ్స్ పట్ల అప్రమత్తత అవసరం

పెదవేగి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీని అరికట్టేందుకు అవగాహన అవసరమని పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ మాధవి అన్నారు. పెదవేగి పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం జరిగిన ఆశాడే కార్యక్రమంలో డాక్టర్ మాధవి మాట్లాడుతూ ఎయిడ్స్ అనేది వ్యక్తిలోని వ్యాధి నిరోధక వ్యవస్థపై ప్రభావం చూపుతుందన్నారు. ఎయిడ్స్ నివారణ అనేది అవగాహనతోనే సాధ్యపడుతుందన్నారు. సీహెచ్‌వో అలివేలు మంగ, పి.హెచ్.ఎన్.నాగమణి, హెచ్.వి.సుజాత పాల్గొన్నారు.



సీఎంకు సమస్యలు తెలుపుతున్న రైతు

ఆక్వా సమస్యలు పరిష్కరించాలి

నిడమర్రు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని నిడమర్రులో సీఎం చంద్రబాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. నల్లమాడు పర్యటనకు వచ్చిన సీఎంను హెలీప్యాడ్ వద్ద స్థానిక టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ఆక్వా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సందర్భంగా ఆక్వా రైతు సత్తినీడి నాని విలేకరులతో మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు ఆక్వా రైతులు వినియోగించిన విద్యుత్‌పై అదనపు సుంకాలు వేయడంతో భారీ మొత్తంలో అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తోందన్నారు. నూతనంగా ఏర్పాటు చేసుకోబోయే ట్రాన్స్ ఫార్మర్లకు సబ్సిడీ ఇవ్వాలన్నారు. పావలా వడ్డీపై ఎకరాకు రూ.2లక్షల వరకు రుణాలివ్వాలని విన్నవించగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. టీడీపీ జనసేన నాయకులు ముత్యాల స్వామి, చల్లంశెట్టి శ్రీనివాసరావు(బాబులు), సత్తినీడి వెంకటేశ్వరరావు, అంబళ్ళ భాస్కరరావు, ఇంటి బాబీ, చల్లంశెట్టి సూరిబాబు, రమేశ్, కన్నాజీ చిన్ని, సంబంగి రంగారావు, మహమ్మద్ గఫ్ఫార్‌ఖాన్ పాల్గొన్నారు.

శీతాకాలం రుగ్మతలపై అవగాహన

ఏలూరు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శీతాకాలంలో గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మలేరియా విభాగం ఆధ్వర్యంలో నగరంలోని పవర్ పేట, లంబాడీపేట, జేపీ కాలనీ అర్బన్ హెల్త్‌సెంటర్లలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, వైద్యాధికారులు గౌతమ్, ట్వింకిల్, నీలిమ, ప్రగతి, మానస, శశాంక్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు ధరించాలని, గోరువెచ్చని నీరు తాగాలని, శీతలపానీయాల జోలికిపోరాదన్నారు. వైద్య సిబ్బంది శ్రీనివాస రావు, మణికుమార్ పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

కొయ్యలగూడెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆదర్శ నియోజకవర్గంగా పోలవర్గాన్ని తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. మంగళవారం మండలంలో పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని కొయ్యలగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద జనవాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక వినతులు తీసుకున్నారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయిబాబు, జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్, మండల జనసేన అధ్యక్షుడు తోట రవి, వ్యవసాయ శాఖ ఏడీఏ బుజ్జిబాబు, రాష్ట్ర ఎస్టీకమిషన్ డైరెక్టర్ కాకిలక్ష్మి, ఎంపీడీవో కిరణ్‌కుమార్, తహసీల్దార్ నాగరాజు, మాజీ టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేశ్, గంగిరెడ్ల మేఘలాదేవి, సొసైటీ అధ్యక్షుడు శ్రీను, పట్టణ జనసేన అధ్యక్షుడు మాదేపల్లి శ్రీను, మండల జనసేన నాయకుడు వాడపల్లి రమేశ్ పాల్గొన్నారు.

న్యాయంపల్లిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

పెదవేగి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యాయంపల్లిలో నూతన ఎరూసలేం ప్రార్థనా మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రార్థనా మందిరం వార్షికోత్సవంతో పాటు సెమీ క్రిస్మస్ వేడుకలు ఫాస్టర్ సి.హెచ్.జెర్మియా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఫాస్టర్ జెర్మియా మాట్లా డుతూ పాపుల పరిరక్షణకు క్రీస్తు శిలువపై రక్తం చిందించాడన్నారు. క్రీస్తు చూపిన మార్గాల్లో నడవాలని ఆయన వివరించారు. ఫాస్టర్లు డాక్టర్ బాబు, జోసెఫ్, విల్సన్, సుకుమార్, ఆనంద్ పాల్, మార్క్, సిలోమాన్‌లు వాక్యోపదేశం చేశారు. భారీగా విశ్వాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తపన చౌదరి

ఆదర్శ హిందూ సమాజ నిర్మాణమే లక్ష్యం

ఏలూరు రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శక్తివంతమైన ఆదర్శ హిందూ సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ పని చేస్తోందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సహ ప్రాంత ప్రచారక్ జనార్దన్ అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏలూరులోని దత్తశ్రమంలో హిందూ సమ్మేళనం, గీతాజయంతి సందర్భంగా హైందవి, తపన ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులతో సహస్రగళ సామూహిక యువగీతా పారాయణ నిర్వహించారు. ఏలూరులోని వివిధ పాఠశాలలకు చెందిన 1500 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యువ గీతా పారాయణం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తపన ఫౌండేస్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయచౌదరి మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా, దేశం శ్రేయస్సు అందరికీ మొదటి లక్ష్యం కావాలన్నారు. ముఖ్యవక్త జనార్దన్ మాట్లాడుతూ హిందువు తన సంస్కృతి, చరిత్ర, ధార్మిక విలువలను తెలుసుకోవాలన్నారు. ప్రముఖ వ్యాపార, ఆధ్యాత్మికవేత్త వేణుగోపాల్ లునాని, మానవీయ జిల్లా సంఘచాలక్ గడ్డ మణుగు సత్యనారాయణ, విభాగ్ సహ కార్యవహిక నీరజ, జిల్లా ప్రచారక్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పెదవేగి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో మంగళవారం రైతన్నా.. మీకోసం కార్యక్రమం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం లబ్ధిదారులకు సీఎం చంద్రబాబు నాయుడు పంపించిన అభినందన లేఖలను ఎమ్మెల్యే ప్రభాకర్ రైతుల వద్దకే వెళ్లి అందించారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు ప్రజలు నానా అగచాట్లు పడ్డారన్నారు. అటు వ్యవసాయం, ఇటు ఐటీరంగంతో పాటు పారిశ్రామిక రంగం కూడా నిరాధరణకు గురైందన్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో తిరిగి గాడిన పడుతోందన్నారు. రైతే దేశానికి వెన్నుముక అనే నానుడిని నిజం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేయడంతో పాటు పెట్టుబడి సాయం కూడా అందిస్తూ అన్ని విధాలా ఆదుకుంటోందన్నారు. తుఫానుల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ కోసం పని చేస్తే ఆరోపణలా?

ఏలూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధికారంలో లేని సమయంలో మండలాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తే కొందరు తనపైనే పలు రకాల ఆరోపణలు చేయడం సరికాదని కుక్కునూరు మండలాధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో 9 పంచాయతీల్లో పార్టీ అనుకూలురు గెలుపొందేలా కష్టపడి పనిచేశానన్నారు. పార్టీని అన్ని విధాలా ముందుకు నడిపిస్తున్న తనను చంద్రబాబు బహిరంగ సభలో ప్రశంసించారని గుర్తు చేశారు. అయితే టీడీపీ అధికారంలోకి రాగానే సొంత పార్టీ నేతలే తనపై ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. ఇటీవల కుక్కునూరు మండలాధ్యక్షుడిగా పార్టీ జరిపిన సర్వేలో 85 శాతం తనకే మద్దతు లభించిందన్నారు. తన సమస్యను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలకు కార్యాచరణ

దెందులూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి గాలాయగూడెం అచ్చమ్మ పేరంటలమ్మ ఉత్సవాలు జనవరి 24 నుంచి 69వ వార్షి కోత్సవాలు నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించింది. ఆలయంలో అచ్చమ్మ తల్లి పేరాంటలమ్మ ఆలయ కమిటీ సభ్యులు సంప్రదాయబద్ధంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే సంప్రదాయ రాట ఏర్పాటు చేసి కార్యక్రమాల నిర్వహణ విజయవంతం చేసేందుకు సమన్వయం ప్రణాళికతో ముందుకుకు వెళ్తున్నామన్నారు. ఉత్సవాలు పూర్తి స్థాయిలో విజయవంతం కావాలని కోరుతూ పూజలు నిర్వహించారు. గాలాయగూడెం ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ రైతుల సమస్యలపై చర్చ

పెదవేగి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పెదవేగిలోని ఏపీ ఆయిల్‌ఫెడ్ కర్మాగారం ప్రైవేటీకరణ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. పెదవేగి, సీతాపురంలోని ఆయిల్‌పామ్ తోటలను మంగళవారం పరిశీలించిన రైతు సంఘం రైతుల సమస్యలపై చర్చించింది. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ రంగ సంస్థగా పెదవేగిలోని ఏపీ ఆయిల్‌ఫెడ్ కర్మాగారం ఒక్కటే ఉందన్నారు. ఇక్కడ వచ్చిన నూనె దిగుబడి ఆధారంగా రాష్ట్రంలోని అన్ని ఫ్యాక్టరీల పరిధిలోని రైతులకు గెలలకు ధర చెల్లిస్తారని చెప్పారు. ఇటీవల ఆయిల్‌ఫెడ్ కర్మాగారాన్ని ప్రైవేటీకరణపై విస్తృత ప్రచారం జరుగుతోందని, ఇదే జరిగితే రాష్ట్రంలోని ఆయిల్ పామ్ రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నూనె దిగుబడి తక్కువుగా రావడానికి గెలల నాణ్యతలో లోపం కాదని, నూతన యంత్ర సామగ్రి లేకపోవడమే అని అన్నారు.

నేడు హనుమద్ వ్రతం

కామవరపుకోట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): హనుమద్వ్రతం ఎంతో విశిష్ట మైందని, ఈ వ్రతాన్ని నిర్వహించి కష్టాలు తొలగించుకుని సుఖాలు పొందవచ్చని స్థానిక లలితా పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు తెలిపారు.శ్రీరాముడు సైతం సీతాన్వేషణలో ఈ వ్రతాన్ని ఆచరించారని, పాండ వులు వనవాసంలో ఉండగా కష్టాలు తొలగిపోవడానికి వ్యాస మహర్షి ఈ వ్రతాన్ని సూచించినట్టు పురాణాలు చెబుతున్నాయి. అలాంటి విశిష్టమైన ఈ వ్రతం బుధవారం నిర్వహించనున్నట్టు కుమారాచార్యులు తెలిపారు.

తొమ్మిదవ రోజుకు దీక్షలు

ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ గ్యారేజీ వద్ద పెట్రోలు బంకులో జరిగిన అవినీతితో ఎటువంటి సంబంధంలేని ముగ్గురు ఉద్యోగుల అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని కోరుతూ ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం దీక్షలు నిర్వహించారు. ఈ దీక్షలో జె.యు.ఎం.రావు, ఓ.చిరంజీవి, పి.వి.రమణ, వి.సూరన్న, సి.హెచ్.ఎస్.ఎస్.నారాయణ, బి.ఎస్.చలం, కె.పి.రావు, పి.వి.వి.వి.ఆర్.కుమార్ పాల్గొన్నారు. 9వ రోజు జరిగిన దీక్షలను జేఏసీ నాయకులు ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ ఏలూరు డిపో గౌరవ అధ్యక్షులు వై.శ్రీనివాస్ ప్రారంభించారు.

మూడ్రోజులు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరురూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలం చాటపర్రు సెక్షన్ 33 కేవీ గుడివాక లంక సబ్ స్టేషన్ పరిధిలో కొత్త లైన్ పనుల నిమిత్తం ఈ నెల 3, 4, 5 తేదీల్లో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు పత్తికోళ్ళలంక, పేదయాగనమిల్లి, కోమటిలంక గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేయం అంబేద్కర్ తెలిపారు.

ఘనంగా లక్ష చామంతుల పూజ

జీలుగుమిల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అభయాంజనేయ స్వామికి లక్ష చామంతులతో ప్రత్యేక పూజలు చేశారు. 20వ కార్తీకమాస మహోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీసువర్చలా సమేత అంజనేయుడి ఉత్సవ మూర్తులకు చామంతి పూలతో అర్చనలు చేశారు. అర్చకులు కస్తూరి చిరంజీవి శర్మ, వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు టీఎస్.రవికుమార్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గారపాటి రాంబాబు దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మండల దీక్ష చేపట్టిన హన్‌మాన్ స్వాములకు బుధవారం ఇరుముడి కార్యక్రమం మహాఅన్నస మారాధనలు జరుగుతాయన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కోలా ధర్మరాజు, కొప్పుల అన్న వరం, కక్కిరాల అప్పారావు చిట్లూరి చందరావు, గంధం నాగేశ్వరరావు ఉన్నారు.



మంత్రి లోకేశ్‌తో ఎంపీల భేటీ

ఏలూరుటూటౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సాయాన్ని అభ్యర్థించేందుకు ఢిల్లీ పర్యటనకు వెళ్లిన మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో ఎంపీల బృందం ఘనస్వాగతం పలికింది. అనంతరం నారా లోకేశ్ ఎంపీలతో బేటీ అయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ వల్ల జరిగిన నష్టాన్ని వివరించి కేంద్ర ప్రభుత్వ సాయాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తేవాల్సిన పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఎంపీ పుట్టా మహేశ్‌తో ఉంగుటూరు మండలంలో జరిగిన పీ4 ప్రజావేదిక సభను గురించి వివరాలడిగి తెలుసుకున్నారు. కేంద్రంతో మాట్లాడి రాష్ట్రానికి ఎన్నో నిధులు సమకూరుస్తున్న ఎంపీ మహేశ్ కుమార్‌ను లోకేశ్ అభినందించారు. సీఎం చంద్రబాబు ఉంగుటూరులో పుట్టా మహేశ్‌కుమార్‌ను ప్రశంసించిన సంగతి తెలిసిందే.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు తనిఖీ

చింతలపూడి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ హైదరాబాదు వెళ్తున్న ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సును సోమవారం రాత్రి తనిఖీ చేశారు. బస్సులో ఎమర్జెన్సీ డోరు ఎక్కడ ఉంది, ప్రయాణికులకు తెలియచేస్తున్నారా అంటూ బస్సు డ్రైవర్‌ను అడిగి వారితో పాటు ప్రయాణికులతో మాట్లాడారు. బస్సులో డోరు నుంచి దిగేందుకు స్టెప్స్ లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. బస్సు యాజమాన్యానికి భద్రంగా తీసుకువెళ్ళాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రవాణ శాఖ అధికారులు ప్రైవేటు సర్వీసుల్లో తనిఖీలు జరిపి నిబంధనలు పరిశీలించాలన్నారు.

సీఎంకు సమస్యలపై వినతి..

లింగపాలెం:చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి అన్నివిధాలా సహకరించాలని కోరుతూ ఉంగుటూరులో సోమవారం జరిగిన పేదల సేవలో ప్రజావేదికలో సీఎం చంద్రబాబును కలిసి చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ వినతి పత్రం అందించారు. చింతలపూడి నియోజకవర్గంలో చేపట్టాల్సిన చింతలపూడి ఎత్తిపోతల పథకం, ఏలూరు- జంగారెడ్డిగూడెం రోడ్డును నాలుగు లైన్‌లుగా మార్చడం వంటి పనులపై వినతి పత్రం అందించారు.



6న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

చాట్రాయి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండ శివారు కరణాపురంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మంత్రి పార్థసారథి, తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఈ నెల 6న ఆవిష్కరిస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి వివిధ రంగాల ప్రముఖులు హాజరవుతున్నారని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు ముదినేపల్లి మండల పరిషత్ సమావేశం

ముదినేపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం జరుగుతుందని ఎంపీడీవో వై. రామకృష్ణ తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికార్లు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

రైతులను వెంటాడుతున్న 'దిత్వా'


ధాన్యంపై బరకాలు కప్పిన దృశ్యం

ముదినేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను రైతులను వెంటాడుతూనే ఉంది. మంగళవారం వర్షం కూడా రావడంతో ముదినేపల్లి ప్రాంత రైతులు బెంబేలెత్తిపోతున్నారు. నాలుగు రోజులుగా తడి ధాన్యం రాశులపై పరదాలు కప్పి ఉన్నాయి. తూకం వేసి సంచుల్లో నింపిన ధాన్యం నిల్వలు కూడా రోడ్ల పక్కనే పడి ఉన్నాయి. ఈ నెల 4 వరకు వర్షాలు కొనసాగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికార్లు ప్రకటించడంతో ధాన్యాన్ని మరో నాలుగు రోజులు వరకు ఆరబెట్టే పరిస్థితి లేక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తుఫాను ఫలితంగా కోతలకు సిద్ధంగా ఉన్న వరిపైరు కూడా నేలకొరుగుతున్నది. ధాన్యం రంగు మారి గింజల్లో నూక శాతం పెరిగే ప్రమాదం ఉందని ధరల్లో ఎంత కోత విధిస్తారోనని భయపడుతున్నారు.

పక్కా గృహాలకు దరఖాస్తు చేయండి

ముదినేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద పక్కా గృహాలు నిర్మించుకోదలచిన వారు ఈ నెల 14వ తేదీలోగా తమ దరఖాస్తులను గ్రామ సచివాలయాల్లో అందజేయాలని టీడీపీ కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు కోరారు. సొంత స్థలం ఉన్నా, లేకున్నా గృహాలు నిర్మించుకోదలచిన పేదలు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. భార్యాభర్తల ఆధార్, బ్యాంక్ అకౌంట్, ఉపాధి పని పథకం కార్డు, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, బ్యాంక్ అకౌంట్స్‌కు లింకు అయిన ఫోన్ నెంబరు, పాస్ పోర్టు సైజు ఫోటో, రేషన్ కార్డు, ఇంటి స్థలం ఉంటే పట్టా ఫోటోస్టాట్ కాపీలను గ్రామ సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు అందజేయాలని, కూటమి నాయకులు లబ్ధిదార్లకు సహకరించాలని తెలిపారు.

ముసునూరు: ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0 - ఎన్టీఆర్ గృహకల్ప పథకానికి ఈ నెల 14 వరకు దరఖాస్తు గడువును పొడిగిస్తూ ప్రభుత్వ నిర్ణయం తీసుకున్నట్లు హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ దివాకర్ తెలిపారు. సొంత స్థలం ఉండి, ఇల్లు నిర్మాణానికి ఆసక్తి ఉన్నవారు గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లేదా హౌసింగ్ కార్యాలయంలో సంప్రదించి, దరఖాస్తు చేసుకోసుకుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వార్థంతోనే పీపీపీ : మాజీ మంత్రి బొత్స


పెరికేగూడెంలో వైసీపీ సమన్వయ సమావేశానికి హాజరైన ఆ పార్టీ నేతలు

మండవల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు స్వార్థంతోనే ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేస్తున్నారని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. వైసీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పెరికేగూడెంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో బొత్స మాట్లాడుతూ పీపీపీ విధానంపై త్వరలోనే అధినేత జగన్‌తో కలిసి గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. మద్యం కేసులో చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పాటు రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా కరువయ్యాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తలు జక్కంపూడి రాజా, మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, తెల్లం బాలరాజు, ఇన్‌చార్జ్ మామిళ్ళపల్లి జయప్రకాష్, కంభం విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో క్రీడాకారులకు సీట్లు

- శాప్ ధ్రువీకరణలో జాప్యం
- క్రీడాకారుల అభ్యర్థనను పరిగణలోకి తీసుకుని ప్రవేశాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నూజివీడు టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నూజివీడు క్రీడాకారులు ఎట్టకేలకు సీట్లు సాధించారు. బాస్కెట్‌బాల్‌లో జాతీయ స్థాయి వరకు క్రీడల్లో పాల్గొన్న నూజివీడు విక్టోరియా టౌన్ హాల్‌కు చెందిన క్రీడాకారులు ధ్రువపత్రాలను సాప్ ధ్రువీకరణలో ఆలస్యం అవడంతో ప్రధాన కౌన్సెలింగ్‌లో సీట్లను సాధించలేకపోయారు. ఈ నేపథ్యంలో క్రీడాకారుల ఆవేదనపై సెప్టెంబరు 20న 'శాప్ నిర్లక్ష్యం.. ఉన్నత చదువుకు దూరం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. తమకు జరిగిన అన్యాయాన్ని వీసీ అండ్‌ఎండీ ఎస్. భరణి, ఆర్జీయూకేటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళగా క్రీడాకారుల అభ్యర్థనను పునః పరిశీలించడంతో ఆర్జీయూకేటీ ఉన్నతాధికారులు క్రీడాకారులకు నూజివీడు ట్రిపుల్ ఐటీ పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో ప్రవేశాలను కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో నూజివీడు సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన బి. ప్రణవి, విజ్డమ్ పాఠశాలకు చెందిన షేక్ ఆశ్రం, నూజివీడు బాలికోన్నత పాఠశాలకు చెందిన బి. ప్రభుదీపిక మంగళవారం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో అడ్మిషన్లు పొందారు. ఈ మేరకు నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్రకుమార్ క్రీడాకారులకు ఐడీ కార్డులను అందించారు. ఈ సందర్భంగా సాప్ వీసీఅండ్ఎండీ ఎస్. భరణి, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. నూజివీడు విక్టోరియా టౌన్ హాల్ కోచ్ వాకా నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారిణికి ఐడీ కార్డు అందిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్ర కుమార్

విద్యతో పాటు భద్రతకు ప్రాధాన్యం


తరగతి గదుల మరమ్మతులు పరిశీలిస్తున్న పంకజ్‌కుమార్

కైకలూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యాలకు బోధనతో పాటు భద్రతకూ ప్రాధాన్యమిస్తామని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పంకజ్‌కుమార్ అన్నారు. మంగళవారం కైకలూరు మండలం భుజబలపట్నం జడ్పీ హైస్కూల్లో శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను ఆయన పరిశీలించారు. సమగ్ర శిక్ష ద్వారా మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తున్నామని క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రస్తుతం పరిస్థితులును జిల్లా కలెక్టర్‌కు వివరిస్తున్నట్లు తెలిపారు.

అసైన్డ్ భూముల్లో సాగు పరిశీలించిన అధికారులు

ముదినేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వైవాక గ్రామ పరిధిలోని ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో అక్రమంగా చేపల చెరువులు తవ్వారని అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం తహసీల్దార్ లతీఫ్ పాషాతో పాటు విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. ఆ గ్రామ పరిధిలోని 23, 24, 25, 15 సర్వే నెంబర్లలోని అసైన్డ్ భూముల్లో అక్రమ సాగు జరుగుతుందని కోరుకొల్లుకు చెందిన చలమలశెట్టి సత్యనారాయణ ఫిర్యాదు చేయడంతో అధికార్లు ఆ భూములను పరిశీలించారు. చేపల చెరువులు త్రవ్వినట్లు నిర్ధారించారు. ఉన్నతాధికార్లకు నివేదిక పంపుతామని తహసీల్దార్ తెలిపారు.

దివ్యాంగుడికి జనసైనికుల ఆర్థిక సాయం

ముదినేపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గురజలో గత ఏడేళ్లుగా పెన్షన్‌కు నోచుకోని తాడిగుడి రంగారావుకు గ్రామ జనసేన నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రంగారావుకు మంగళవారం గ్రామ జనసేన అధ్యక్షుడు పోకల దేవేంద్ర గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షుడు చేడిగ అప్పారావు జనసైనికులు రూ. 6 వేలు నగదు అందజేశారు. ఈ దివ్యాంగుడికి పెన్షన్ మంజూరయ్యేలా కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

కుష్ఠు సర్వే సమగ్రంగా జరపాలి

ముసునూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కుష్ఠు సర్వే సమగ్రంగా జరపాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ అన్నారు. మంగళవారం కాట్రేనిపాడులో కుష్ఠు ఇంటింటి సర్వేను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి వ్యాధిగ్రస్థులను గుర్తించే ప్రక్రియను పరిశీలించి ఆశా వర్కర్లు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం పాఠశాల విద్యార్థులను పరీక్షించారు. వైద్య సిబ్బంది రోజువారి సర్వే వివరాలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ, వైద్యాధికారిణి డాక్టర్ భవాని, ఎంపీహెచ్ఎస్ మురళీమోహన్, హెల్త్ అసిస్టెంట్ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల మధ్య చిచ్చు పెడితే సహించను

- అటవీ భూములు ఆక్రమిస్తే చర్యలు : మంత్రి సారథి
- అటవీ, రెవెన్యూ సరిహద్దులను విభజించండి
- అధికారులకు మంత్రి ఆదేశం


అటవీ, రెవెన్యూ భూ సరిహద్దులను పరిశీలిస్తున్న మంత్రి, అధికారులు

నూజివీడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం జంగంగూడెం, దేవరగుంట గ్రామాల మధ్య సరిహద్దులోని భూముల విషయంలో వివాదం నెలకొని ఇటీవల రైతులు పరస్పరం దాడులకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం రెవెన్యూ, పోలీస్, అటవీశాఖ అధికారులతో వివాదాస్పద భూముల్లో ఇరు గ్రామాల ప్రజలతో మంత్రి కొలుసు ప్రార్థసారధి సమావేశమయ్యారు. మంత్రి స్వయంగా రెండు కిలోమీటర్ల అటవీ ప్రాంతంలో మోటార్ సైకిల్‌పై వెళ్ళి అధికారులతో కలిసి భూములు పరిశీలించి డీఎఫ్ఓ, సబ్ కలెక్టర్‌కు పలు సూచనలు చేశారు. దేవరకొండ గ్రామ పరిధిలోని ఆర్ఎస్ నెంబర్-1లో 70 మందికి 1991లో ఒక్కొక్కరికి 70 సెంట్లు చొప్పున భూమిని ఇవ్వడం జరిగిందని తెలుసుకున్న మంత్రి పట్టా ఇచ్చిన భూమి కి మించి అటవీ భూములు ఎట్టి పరిస్థితుల్లో ఆక్రమించడానికి వీలులేదని, వెంటనే రెవెన్యూ, ఫారెస్టు అధికారులు సరిహద్దులు నిర్ణయించాలని ఆదేశించారు. దేవరగుంట గ్రామానికి చెందిన రైతులకు సంబంధించిన భూములను సబ్ డివిజన్ చేసి ఫారెస్ట్ సరిహద్దులను నిర్ణయించాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా భూ వివాదాలు సృష్టించినా.. ఆక్రమించినా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సామరస్యంగా ఇరు గ్రామాల వారు చర్చించుకుని ఒక నిర్ణయానికి వచ్చి అటవీ బంజరును సాగు చేసుకుంటే బాగుండేదని, ఒకరిపై ఒకరు దాడులకు దిగడం వల్ల పరిస్థితి సంక్లిష్టంగా మారిందన్నారు. నిబంధనల ప్రకారం అటవీ భూములు సాగు చేయకూడదన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యను పరిశీలించి నప్పుడు ప్రస్తుతం సాగులో ఉన్న భూముల్లో బోర్లను కొందరు కోసివేయడం బట్టి చూస్తే వివాదాన్ని కావాలని ఎవరో వెనుక ఉండి సృష్టిస్తున్నారని వారు ఎంతటి వారైనా రైతుల్ని, పేదల్ని ఇబ్బంది పెడితే ఉపేక్షించనని మంత్రి అన్నారు. ఎంత మందికి పట్టాలిచ్చారో ఆ పట్టాలు పరిశీలించాలన్నారు. జంగంగూడెంలోని రీసర్వే నెంబర్ 22లో ఉన్న ఫారెస్టు భూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న, డీఎస్పీ కేవీవీఎన్‌వి ప్రసాద్, తహసీల్దార్ భద్రు, ఎంపీడీవో చెన్న రాఘవేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి : కామినేని


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని.. సింగరాయపాలెంలో పూజలు



కలిదిండి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పాతాళ భోగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు దాతలు ముందుకు రావాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆలయం వద్ద అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించి పూర్వ వైభవంగా తెస్తుందన్నారు. శివరాత్రి నాటికల్లా ప్రాకార మండప నిర్మాణం పూర్తి చేసి ఆలయ ఆవరణం మెరక చేయాలన్నారు. తొలుత స్వామివారికి పూజలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగి రాజు, ఏఎంసీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ రమాదేవి, కలిదిండి, కోరుకొల్లు డీసీ చైర్మన్‌లు భోగేశ్వరరావు, పీ.సత్యనారాయణ పాల్గొన్నారు.

● గుర్వాయిపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన నాందీ సురక్ష వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ తక్కువ ధరకే సురక్షిత నీటిని అందించటం అభినందనీయమన్నారు. తాగునీటి చెరువు అభివృద్ధికి, వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి గ్రామంలో చదువుకున్న యువత ప్రభుత్వం ద్వారా నిధుల మంజూరుకు కృషి చేశారని వారిని ఆదర్శంగా తీసుకుని గ్రామాల్లో యువత అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. సర్పంచ్ బత్తిన ఉమామహేశ్వరరావు, మాజీ సర్పంచ్ పోసిన పాపారావు గౌడ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సింగరాయపాలెం ఆలయాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

ముదినేపల్లి: సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని అత్యున్నత స్థాయిలో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కామినేని తెలిపారు. షష్టి కల్యాణోత్సవాల్లో పూజలు జరిపారు. ఆలయ అసిస్టెంట్ కమీషనర్ ఆర్ గంగా శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నూతన కార్యాలయ భవనం నిర్మాణం, ఆలయ ఆదాయ వనరులు పెంపునకు దేవదాయశాఖ మంత్రి, ఉన్నతాధికార్లతో చర్చిస్తానన్నారు. శ్రీహరిపురం సర్పంచ్ విశ్వేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ భూతానికి వైద్యమేది ?

(3వ పేజీ తరువాయి)

పర్యాయాలు శంకుస్థాపనలు జరిగాయి. రూ.550 కోట్లతో ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో పనులు చేపట్టారు. 2023 ఏప్రిల్ 26న ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 150 ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం సీట్లకు నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతి ఇచ్చింది. 2023 సెప్టెంబరు 1 నుంచి ఫస్ట్ ఇయర్ తరగతులు మొదలయ్యాయి. 12 మంది మినహా మిగిలిన వారంతా హాస్టలర్సే. 2024 సెప్టెంబరులో రెండో బ్యాచ్, 2025 అక్టోబరులో మూడో బ్యాచ్ విద్యార్థులు చేరారు. మొట్ట మొదటిగా చేరిన విద్యార్థులు రెండవ బ్యాచ్ వారిని ర్యాగింగ్ పేరుతో ఇబ్బందులకు గురి చేయడంతో విషయం అధికారులకు వెళ్లడంతో వారు తీవ్రంగా హెచ్చరించారు. థర్డ్, సెకండియర్ విద్యార్థుల మధ్య వైరం మరింత ఎక్కువైంది. ఇటీవల సీనియర్ల వేధింపులకు ఒక జూనియర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కొందరు ప్రొఫెసర్ల ఒత్తిడితో ఆ విద్యార్థికి రహస్యంగా వైద్యం చేయించి, అతని వాంగ్మూలం కుటుంబ సమస్యగా మార్చారని ఆరోపిస్తున్నారు.

వారి భవిష్యత్ కాపాడేందుకు..

విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ఒక పక్క పోలీసు లు, మరోపక్క అధ్యాపకులు శాయశక్తులా కృషి చేస్తూ వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో వర్గ విబేధాలు తలెత్తినా ర్యాగింగ్ జరిగినా ఉపేక్షించేది లేదని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయితే జూనియర్ విద్యార్థులు ఆరోపిస్తున్న ర్యాగింగ్ అంశం ఎంత వరకూ వాస్తవం? సీనియర్ విద్యార్థులు ఆరోపిస్తున్నట్టు జూనియర్లు చేస్తున్న దాడుల్లో నిజం ఎంత? అనే కోణంలో పోలీసులు దర్యాప్తును చేస్తున్నారు. ర్యాగింగ్‌ను నియంత్రించడానికి హాస్టల్‌లో ఒక కమిటీ, కాలేజీలో మరో కమిటీ ఉంది. ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో మరో కమిటీ ఉంది. కాని ఇంత కాలం విద్యార్థులు ఏ కమిటీకి చెప్పకుండా అకస్మాత్తుగా దాడుల కు తెగబడడంతోనే అందరూ అవాక్కయ్యారు.

విద్యార్థులకు రక్షణ ఏది?

ఎంతో కష్టపడి చదివి ర్యాంకులను సాధించి మెరిట్ విద్యార్థులుగా రాణించి ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ ఉచిత సీట్లను పొందారు. మరికొందరు వివిధ కేటగిరిల్లో పేమెంట్ సీట్లు పొందారు. వారంతా వేర్వేరు రాష్ట్రాలు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారే. తమ కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ ఎంబీబీఎస్‌ను అభ్యసించి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి అహర్నిశలు కష్టపడుతున్నారు. మొదటి సంవత్సరమే చేరిన విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో ఎనాటమి విభాగంలో మొదటి ర్యాంకు, వివిధ ర్యాంకులను సాధించారు. మెడికల్ కళాశాలకు ఆ విద్యార్థులు మొదటి సంవత్సరమే కీర్తి కిరీటాలను తీసుకువచ్చారు. హాస్టల్‌లో వార్డెన్, అసిస్టెంట్ వార్డెన్లుగా సీనియర్ ప్రొఫెసర్లను నియమించాలి. ఇక్కడ నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా నియమించడంతో క్రమశిక్షణ తప్పింది. కేర్ టేకర్లను నియమించడానికి నోటిఫికేషన్ జారీ చేయాల్సి వున్నా అలాంటిది ఏమి లేకుండా ఒక ప్రొఫెసర్ కనుసన్నల్లోనే వీటిని భర్తీచేశారు. దీంతో అక్కడ విద్యార్థుల మంచి చెడ్డలను చూసేందుకు సరైన వారు లేరు. ఎంతో మంది ప్రాణాలు కాపాడడానికి వైద్య విద్యను అభ్యసిస్తున్న వారికి మెరుగైన సదుపాయాలు, సౌకర్యాలు చక్కని వాతావరణం ఏర్పాటు చేస్తే మెరుగైన ఫలితాలు సాధిస్తారు. అధికారులు మెడికల్ కళాశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, విద్యార్థుల మధ్య నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి.

పీహెచ్‌సీకి బెడ్‌షీట్ల వితరణ

చాట్రాయి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): చాట్రాయి పీహెచ్‌సీకి స్థానిక జనసేన నాయకుడు నవరం రామారావు మంగళవారం రూ. 10 వేలు విలువైన 20 బెడ్‌షీట్లను అందజేశారు. రామారావును పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ దుర్గాప్రసాద్ అభినందించారు. జనసేన నాయకులు తుమ్మలపల్లి పాపారావు, కొల్లు శ్రీకాంత్, పసుపులేటి మహేష్, రంగా, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆత్మరక్షణపై అవగాహన

ఆగిరిపల్లి, డిసెంబరు 2, (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు ఆత్మరక్షణకు సెల్ఫ్ డిఫెన్స్ అవసరమని హెచ్ఎం పి. పుష్పలత అన్నారు. గురువారం స్థానిక జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. శత్రువుని ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వెట్టర్ల వితరణ

చాట్రాయి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగూడెం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 25 మంది విద్యార్థులకు దాత సుకన్య నటరాజన్ పంపిన స్వెట్టర్లను మంగళవారం ఎంఈవోలు ఎం. శ్రీనివాస్, బ్రహ్మచారి అందజేశారు. అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలన్నారు.

బ్యాగ్‌ల వితరణ

ముదినేపల్లి: ముదినేపల్లి మండలం పెయ్యేరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ముదినేపల్లి ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ సంస్థ అధికార్లు బ్యాగ్‌లను మంగళవారం అందజేశారు. సంస్థ డివిజినల్ మేనేజర్ మిరియాల రత్నం, బ్రాంచ్ మేనేజర్ రాచప్రోలు వరప్రసాద్ బ్యాగ్‌లను అందజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి, పాఠశాల హెచ్ఎం బేతాళ రాజేంద్ర ప్రసాద్, టీచర్ చక్రధర్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

లారీ, జీప్ ఢీ .. తప్పిన ముప్పు

కలిదిండి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): లారీని ఢీకొని మహేంద్ర థార్ జీప్ ధ్వంసమైంది. కలిదిండికి చెందిన గోనేపూడి సాంబశివప్రసాద్ సింగరాయపాలెం నుంచి కలిదిండికి మంగళవారం జీప్‌లో వస్తుండగా కోరుకొల్లు వద్ద ముందుగా వెళ్తున్న లారీ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వేగంగా వస్తున్న వ్యాన్ లారీని ఢీకొని నుజ్జయింది. వ్యాన్‌లో బెలూన్‌లు తెరుచుకోవడంతో ఎవరికీ గాయాలు కాలేదు. బాధితుడి ఫిర్యాదుపై ఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.